Follow: @ANNTELUGU

07-06-2025

# మహా పత్రిక

ANN తెలుగు

శనివారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 185 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI    REGISTERED NUMBER: APTEL/2003/09316    WWW.EPAPER.MAHAADAILY.COM



## ఒక్క డీఏ ఉద్యోగులను అవమానించినట్లే

- కాంట్రాక్టర్లు, సర్పంచ్‌ల ఆత్మహత్యలు ప్రభుత్వానికి కనిపిస్తలేవా?
- ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ డీకే అరుణ మండిపాటు

**ఎఎన్ఎన్-మహాతో**
**బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ**

**మహా:** రాష్ట్ర ప్రభుత్వంలో పెండింగ్ బిల్లులు రావాలంటే 30 శాతం కమీషన్ చెల్లించాల్సి వస్తోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. సంవత్సరాలుగా బిల్లులు రాకుండా చాలా మంది కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు కనిపించట్లేదు, చెవులు వినిపించట్లేదని విమర్శించారు. శుక్రవారం నాంపల్లిలోని పార్టీ స్టేట్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడారు. గురువారం జరిగిన కేబినెట్ నిర్ణయాలపై ఆమె మండిపడ్డారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా కేబినెట్ సమావేశం ద్వారా ఈ ప్రభుత్వం, మంత్రి వర్గం ఏమీ తేల్చింది లేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉంటే కేవలం ఒక్క డీఏ ప్రకటించడం అనేది సిగ్గు చేటని విమర్శించారు. మిగతా 2లో

**టాప్ న్యూస్**

### కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు



- ప్రభుత్వం రూ. 25 వేల కోట్ల స్కామ్ చేసిందని ఆరోపణలు
- ఆత్రం సుగుణ ఫిర్యాదుతో ఉట్నూర్ పీఎస్‌లో కేసు
- ఆ కేసును కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు
- హైకోర్టు తీర్పు సవాల్ చేస్తూ సుప్రీం ఆశ్రయించిన సుగుణ
- పిటిషన్‌పై విచారణ.. మాజీ మంత్రికి నోటీసులు
- నాలుగు వారాల్లోగా తమ స్పందన తెలపాలని ఆదేశాలు

03


### రాజన్న కోడెలపై రాజకీయాలొద్దు



- కోడెల దుస్థితికి పాపం కేసీఆర్ పాలనదే
- వేములవాడకు కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా ఇవ్వలే
- పదేళ్లలో దేవాదాయ శాఖలో డెవలప్మెంట్ యాక్టివిటీ జరిగిందా?
- పదేండ్ల అరిష్టపు పాలన ఇప్పుడు బీఆర్ఎస్‌ను వెంటాడుతోంది
- రాష్ట్ర సంపదను ఇష్టారీతిన దోచుకున్న కల్వకుంట్ల దండుపాళ్యం బ్యాచ్
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

02

### పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు



- పేదలు ఉన్నచోటే జి +3 పద్ధతిలో నిర్మాణం
- హైదరాబాద్‌కు దూరంగా ఇండ్లిస్తే జీవనోపాధికి ఇబ్బంది
- తక్షణమే లబ్దిదారులను గుర్తించి ప్రక్రియ ప్రారంభించాలి
- పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్నదే లక్ష్యం: మంత్రి పొంగులేటి
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష

03



# అది దయ్యాల రాష్ట్ర సమితే


## నీ బిడ్డ చెప్పిన పంచాయితీ తేల్చు

### దయ్యాల నాయకుడు ఫామ్‌హౌస్‌లో నిద్రపోతుండు

### పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చిండు

- పదేళ్లు దోచుకుతిన్న రాబందులు మమ్మల్ని ప్రశ్నిస్తారట
- అలాంటి దయ్యాల పార్టీని పొలిమేరల వరకు తరిమికొట్టాలె
- ఒక్క నోటీసుకే ఆగమైతుండు.. జవాబు చెప్పాల్సింది పోయి విమర్శలా?
- నన్ను జైలుకు పంపిన వారిని గద్దె దించుతానని శపథం చేశా.. నెరవేర్చినా
- తిరుమల తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేస్తాం
- మోదీ సబర్మతి, గంగా నది ప్రక్షాళన చేసుకోవచ్చుగానీ మేం మూసీ ప్రక్షాళన చేసుకోవద్దా?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- ఆలేరు నియోజకవర్గంలో రూ. 1500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**మహా:** బీఆర్ఎస్ పార్టీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అది బీఆర్ఎస్ పార్టీ కాదని, డీఆర్ఎస్ దెయ్యాల రాష్ట్ర సమితి అని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆ ఇంటి బిడ్డనే చుట్టూ దయ్యాలు ఉన్నాయని బయటపెట్టినా ఆ దయ్యాల నాయకుడు సమాధానం చెప్పడం లేదని ఎద్దేవా చేశారు. ఈ కొరివి దెయ్యాలను తెలంగాణ పొలిమేరల వరకు తరిమికొట్టాలని వ్యాఖ్యానించారు. యాదాద్రి జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆలేరు నియోజకవర్గంలో రూ. 1500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం తిరుమలాపూర్ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్.. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు తెలియచెప్పే ప్రయత్నం చేశారు. మిగతా 3లో



# అంతా కేసీఆరే

## కాళేశ్వరంలో నా పాత్రేమీ లేదు

### కేబినెట్ బాస్‌గా ఆయన చెప్పినట్లే చేశాం

నా కణతపై గురిపెట్టినా నిజమే చెప్తా.. ఈ ప్రాజెక్టుకు అర్థికశాఖకు సంబంధం లేదు

ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలోనే అంతా జరిగింది.. కార్పోరేషన్ ద్వారానే నిధులు

### విచారణ కమిషన్ ముందు ఈటల రాజేందర్

కేసీఆర్ కు ఈటల క్లీన్ చిట్ ఎందుకిచ్చారు? జగ్గారెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో అవకతవకలపై కాళేశ్వరం కమిషన్ బహిరంగ మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం హాజరయ్యారు. కమిషన్ చైర్మన్ పీ చంద్రఘోష్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా, కేబినెట్ నిర్ణయం మేరకు నిధులు విడుదల చేశానని స్పష్టం చేశారు. నిధులు ఎవరికి ఇవ్వాలో కూడా ఇరిగేషన్ శాఖ పరిధిలోనే జరిగిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను తాను కట్టానని కేసీఆరే చాలాసార్లు వేదికలపై చెప్పుకున్నారని అన్నారు. మిగతా 2లో

**కేబినెట్‌కు బాస్ కేసీఆర్..**

కాళేశ్వరానికి మొదట్లో రూ.63 వేల కోట్ల అంచనా వేయగా.. క్రమంగా ఆ వ్యయం రూ.83 వేల కోట్లకు పెరిగిందని, చివరికి ఎంతైందో తనకు తెలియదని అన్నారు. కాళేశ్వరం విలువ, ఖర్చుతో ఆర్థిక శాఖకు సంబంధం లేదని కామెంట్ చేశారు. అన్ని విషయాలు ఇరిగేషన్ శాఖతో పాటు కాళేశ్వరం కార్పొరేషన్‌తోనే ముడిపడి ఉన్నాయని స్పష్టం చేశారు.



### 69 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్ మహా గణేశుడు

- శ్రీ విశ్వశాంతి మహాశక్తి రూపంలో భక్తులకు దర్శనం
- ఉత్సవ కమిటీల వైభవంగా కర్ర పూజ
- హాజరైన కిషన్ రెడ్డి, దానం, విజయలక్ష్మి, అనిల్ కుమార్

02



### ఎమ్మెల్యేల పనితీరుపై టీపీసీసీ రిపోర్ట్

- మెజారిటీ ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేదు
- నియోజకవర్గాల్లో ఎక్కువ సమయం గడపాలి
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- మీనాక్షి ఇన్ ఛార్జిగా రావడం తెలంగాణకు శుభసూచకం
- ఈనెలలోనే టీపీసీసీ కార్యవర్గం, విస్తరణకు అవకాశం

వివరాలు 2లో

## తెలంగాణ నీటిహక్కుల కోసం.. తగ్గేదెలే

### బనకచర్లతో తెలంగాణకు అన్యాయమే..

- ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించం
- తేల్చిచెప్పిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రాజెక్టుపై తీవ్ర అభ్యంతరం.. కేంద్రమంత్రులు సీఆర్ పాటిల్, నిర్మలా సీతారామన్ కు లేఖ



**హైదరాబాద్, మహా:** బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవిధానాలకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. తెలంగాణ నీటి హక్కులకోసం రాజీలేని పోరాటం చేస్తాం.. వెనక్కి తగ్గేదేలే . ఈ ప్రాజెక్టును తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశామని చెప్పారు. ఈ నిర్మాణం గురించి ఏపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని, వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ చెప్పినట్లు చెప్పారు. తాము చట్ట ప్రకారమే ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చినట్లు ఉత్తమ్ వివరించారు. తాము రాసిన లేఖలో ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా వివరించామన్నారు. చట్టవిరుద్ధంగా ఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదని, తెలంగాణకు అన్యాయం జరిగితే ఎంత వరకైనా పోరాడుతామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని, వెనక్కి తగ్గేదేలేదన్నారు. అప్పుడు నేతలు నాటకాలు ఆడుతున్నారు బనకచర్లకు అనుమతులు ఇవ్వకుండా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా బేసిన్ నుంచి తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే పదేళ్లు బీఆర్ఎస్ సహకరించిందని విమర్శించారు. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీఎంసీలు ఏపీకి వెళితే, బీఆర్ఎస్ హయాంలో 1,254 టీఎంసీలు మిగతా 2లో

## ట్రంప్ దెబ్బకు ఢీలా పడ్డ అమెరికా జాబ్ మార్కెట్

భారీగా తగ్గిన ఉద్యోగాలు.. మేలో 1.30 లక్షల ఉద్యోగాలే భర్తీ

ఏప్రిల్‌లో 1.77 లక్షల జాబ్స్ భర్తీ.. అమెరికా కంపెనీలపై ట్రంప్ ఎఫెక్ట్



**మహా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎఫెక్ట్ ఆ దేశ జాబ్ మార్కెట్ పై తీవ్రంగా ఉంది. ట్రంప్ దెబ్బ కు ఒక్కసారిగా ఢీలా పడింది. మే నెలలో అమెరికాలోని ప్రైవేటు కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కేవలం 1.30 లక్షల మందినే ఉద్యోగాల్లో భర్తీ చేసుకున్నాయి. అంతకుముందు ఏప్రిల్ నెలలో ఈ సంస్థలు అత్యధికంగా 1.77 లక్షల మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నాయి. ట్రంప్ తీరు వల్ల అమెరికా ప్రభుత్వ పాలసీ నిర్ణయాల్లో అనిశ్చితి ఏర్పడింది. మిగతా 3లో



# అంతా కేసీఆరే

(మొదటిపేజీ తరువాయి)

కేబినెట్‌కు బాస్ కేసీఆర్ అని.. నిర్ణయం తీసుకుంది ఆయనేనని కుండబద్దలు కొట్టారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ వాస్తవ రిపోర్టులను బయటపెట్టాలని అన్నారు. ఎంత నష్టం జరిగిందో.. ఎవరు బాధ్యులతో ప్రభుత్వమే చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

**కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్ ఎదుట ఇలా**

కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్ ఎదుట మాజీ మంత్రి, ఎంపీ ఈటెల రాజేందర్ హాజరయ్యారు. కమిషన్ అడిగిన ప్రశ్న లకు సమాధానం ఇచ్చారు. అంతా నిజమే చెబుతాను అని ప్రమాణం చేసిన తర్వాత కమిషన్ ప్రశ్నలు వేసింది.

**కమిషన్ ప్రశ్న :**

ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఆర్థిక మంత్రిగా పని చేశారు?

**ఈటెల సమాధానం :**

2014 జూన్ నుంచి 2018 డిసెంబర్ 18 వరకు మంత్రిగా పని చేశాను.

**కమిషన్ ప్రశ్న :**

కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నిర్మాణం ఎవరు నిర్ణయం తీసుకున్నారు..?

**ఈటెల సమాధానం :**

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కేబినెట్ నిర్ణయంతోనే నిర్మాణం

**కమిషన్ ప్రశ్న :**

ఎందుకు ప్రాజెక్టు షిఫ్ట్ చేయ్యాల్సి వచ్చింది. రీ డిజైన్ ఎందుకు చేయాల్సి వచ్చింది..?

**ఈటెల సమాధానం :**

టెక్నికల్ టీమ్, ఎక్స్పర్ట్ కమిటీలు గోదావరిపై అన్నారం, సుందిళ్ళ, మేడిగడ్డను సూచించాయి, తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్, హరీష్ రావులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు అయ్యింది. సబ్ కమిటీ రిపోర్ట్ తర్వాత కేబినెట్ లో అప్రూవ్ తర్వాత రీ డిజైనింగ్ జరిగింది.

**కమిషన్ ప్రశ్న :**

కేబినెట్ లో అప్రూవ్ ఉందా?

**ఈటెల సమాధానం :**

అన్నికేబినెట్ ఆమోదం తర్వాతే జరిగాయి.

**కమిషన్ ప్రశ్న :**

కాళేశ్వరం ప్రాజెక్టు బడ్జెట్ 60 వేల కోట్ల నుంచి 83 వేల కోట్లకు ఎందుకు పెరిగింది..?

**ఈటెల సమాధానం :**

అంత బడ్జెట్ ఎందుకు పెరిగిందో.. ఎంత అయిందో తెలియదు.

**కమిషన్ ప్రశ్న :**

ప్రాజెక్ట్ డిపిఆర్ కోసం వ్యాప్కోస్ కంపెనీకి రూ.594.45 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందా..?

**ఈటెల సమాధానం :**

నాకు తెలియదు.

**కమిషన్ ప్రశ్న :**

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటు ఎందుకు చేశారు.?

**ఈటెల సమాధానం :**

ఒకేసారి అంత డబ్బుకావాలంటే బడ్జెట్ సరిపోదు.. అప్పుల ద్వారా నిధులు సమర్చేందుకు కార్పొరేషన్ ఏర్పాటు.

**కమిషన్ ప్రశ్న :**

బ్యారేజీల నిర్మాణంతో వచ్చే రాబడితో రుణాల తిరిగి చెల్లింపు అనేది ఆధారపడి ఉంటుందని విజయా బ్యాంక్ చెప్పింది కదా..?

**ఈటెల సమాధానం :**

ఆ వివరాలు తనకు తెలియదు. కార్పొరేషన్ ఏర్పాటు తర్వాత కేసీఆర్ వాళ్లే చూస్తున్నారు.

**రూ.595 కోట్ల విషయం నాకు తెలియదు**

కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎక్కడ కట్టాలనేది ఆర్థిక శాఖకు సంబంధం లేదని.. ముందుగా రూ.82 వేల కోట్ల వ్యయంగా అంచనా వేశారని ఈటల రాజేందర్ తెలిపారు. ఆ తర్వాత ఆ అంచనాలు ఎంతకు పెరిగాయో తనకు తెలియదని అన్నారు. ప్రాజెక్ట్ డీపీఆర్ కోసం రూ.595 కోట్లు ఇచ్చిన విషయం కూడా తనకు తెలియదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి తాను మొట్టమొదటి ఆర్థిక శాఖ మంత్రిగా పని చేశారని, తెలంగాణ సమాజానికి 25 ఏళ్లుగా తాను సుపరిచితుడినని అన్నారు. 2016 తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.16,500 కోట్లని.. ఆ తరువాత ప్రాజెక్ట్ వ్యయం రూ.38 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. తుమ్మిడిహట్టి ద్వారా నీటి అవసరాలు తీరవనే రిపోర్టులు వచ్చాయని అన్నారు. ప్రత్యామ్నాయం చూడాలని ప్రభుత్వం కోరడంతో కాళేశ్వరాన్ని ఎంపిక చేశారని పేర్కొన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావు చైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీ వేశారని అందులో తాను తుమ్మల నాగేశ్వర్ రావు సభ్యులుగా ఉన్నామని అన్నారు. టెక్నికల్ కమిటీ రిపోర్ట్ ప్రకారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీలు నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. అనంతరం కేబినెట్ కూడా మొత్తం బ్యారేజీల నిర్మాణానికి ఆమోదం తెలిపిందని అన్నారు. టెక్నికల్ అంశాలన్ని పరిశీలించాకే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ సమాచారం అంతా కేసీఆర్, హరీశ్‌రావుల వద్దే ఉందని ఈటల పేర్కొన్నారు.

**అప్పటి కేబినెట్‌కు కేసీఆరే బాస్.. ఎంపీ ఈటల సంచలన వ్యాఖ్యలు**

కాళేశ్వరం ప్రాజెక్టు లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో అవకతవకలపై కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ కాసేపటి ముగిసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో విచారణకు హాజరైన మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కమిషన్ చైర్మన్ పీ చంద్రఘోష్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా, కేబినెట్ నిర్ణయం మేరకు నిధులు విడుదల చేశానని స్పష్టం చేశారు. నిధుల విడుదల విషయంలో తన సొంత అజెండాలు ఏమి లేవని అదే విషయాన్ని కాళేశ్వరం కమిషన్‌కు ఎదుట స్పష్టం చేశానని అన్నారు. నిధులు ఎవరికి ఇవ్వాలో కూడా ఇరిగేషన్ శాఖ పరిధిలోనే జరిగిందని అన్నారు. బడ్జెట్ కేటాయింపులను మాత్రమే ఆర్థిక శాఖ చూసుకుందని ఈటల రాజేందర్ తెలిపారు.

### రూ.595 కోట్ల విషయం నాకు తెలియదు..

**కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎక్కడ కట్టాలనేది ఆర్థిక శాఖకు సంబంధం లేదని.. ముందుగా రూ.82 వేల కోట్ల వ్యయంగా అంచనా వేశారని తెలిపారు. ఆ తర్వాత ఆ అంచనాలు ఎంతకు పెరిగాయో తనకు తెలియదని అన్నారు. ప్రాజెక్ట్ డీపీఆర్ కోసం రూ.595 కోట్లు ఇచ్చిన విషయం కూడా తనకు తెలియదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి తాను మొట్టమొదటి ఆర్థిక శాఖ మంత్రిగా పని చేశారని, తెలంగాణ సమాజానికి 25 ఏళ్లుగా తాను సుపరిచితుడినని అన్నారు. 2016 తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.16,500 కోట్లని.. ఆ తరువాత ప్రాజెక్ట్ వ్యయం రూ.38 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. తుమ్మిడిహట్టి ద్వారా నీటి అవసరాలు తీరవనే రిపోర్టులు వచ్చాయని అన్నారు. ప్రత్యామ్నాయం చూడాలని ప్రభుత్వం కోరడంతో కాళేశ్వరాన్ని ఎంపిక చేశారని పేర్కొన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావు చైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీ వేశారని అందులో తాను తుమ్మల నాగేశ్వర్ రావు సభ్యులుగా ఉన్నామని అన్నారు. టెక్నికల్ కమిటీ రిపోర్ట్ ప్రకారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీలు నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. అనంతరం కేబినెట్ కూడా మొత్తం బ్యారేజీల నిర్మాణానికి ఆమోదం తెలిపిందని అన్నారు. టెక్నికల్ అంశాలన్ని పరిశీలించాకే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ సమాచారం అంతా కేసీఆర్, హరీశ్‌రావుల వద్దే ఉందని ఈటల పేర్కొన్నారు.**

# 69 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్ మహా గణేశుడు

## శ్రీ విశ్వశాంతి మహాశక్తి రూపంలో భక్తులకు దర్శనం

ఉత్సవ కమిటీల వైభవంగా కర్ర పూజ

హాజరైన కిషన్ రెడ్డి, దానం, విజయలక్ష్మి, అనిల్ కుమార్ యాదవ్




**మహా:** హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగే ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలకు ఈ ఏడాది శంకుస్థాపనగా కర్ర పూజ ఘనంగా నిర్వహించారు. నిర్జల ఏకాదశి రోజున జరిగే ఈ సంప్రదాయ కార్యక్రమంతో ఖైరతాబాద్ మహాగణపతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ కార్యక్రమాన్ని శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఖైరతాబాద్, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ మహాగణపతి భక్తులకు 69 అడుగుల ఎత్తులో దర్శనమివ్వనున్నాడు. ఈసారి గణపతి రూపాన్ని శ్రీ విశ్వశాంతి మహా శక్తిగా రూపొందిస్తున్నారు. మహాగణపతికి కుడి వైపు శ్రీ జగన్నాథ స్వామి, శ్రీ లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామి దర్శనమిస్తే, ఎడమవైపు లలిత త్రిపుర సుందరి, శ్రీ గజ్జలమ్మ దేవి కూడా కొలువై ఉంటారు. ఉత్సవ సమితి సభ్యులు ఈ ఏడాది గణపతి రూపాన్ని అధికారికంగా విడుదల చేశారు. భక్తులకు విశేషంగా ఆకర్షించే విధంగా రూపొందిస్తున్న ఈ గణేశ్ విగ్రహం నిర్మాణం త్వరలో ప్రారంభమవనుంది. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు ఉత్సవ కమిటీలు సిద్ధంగా ఉన్నాయి.

**ఈ సారి 71 వేడుకలు..**

ఇరువైపులా కుడి పక్కన శ్రీ జగన్నాథ స్వామి, శ్రీ లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామి, ఎడమవైపు లలిత త్రిపుర సుందరి, శ్రీ గజ్జలమ్మ దేవి ఉండనున్నారు. కర్ర పూజ కార్యక్రమంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల్ రామచంద్రారెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. 70 సంవత్సరాల నుంచి ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సారి 71 వేడుకలు నిర్వహిస్తున్నామని.. ఈ సందర్భంగా జరుగుతున్న వేడుకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. జాతీయ స్థాయిలో ఖైరతాబాద్ గణనాధుడు పేరు ప్రతిష్టలు వచ్చాయని తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం, పోలీస్ శాఖ అన్ని విధాలుగా మాకు సపోర్ట్ చేసిందని, మీడియా పాత్ర ఎప్పటికి మరచిపోలేమన్నారు. ప్రతి ఒక్కరు ఈ సారి జరిగే ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలకు సపోర్ట్‌గా ఉంటారని ఆశిస్తున్నానన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ త్వరగా కోలుకుని ఖైరతాబాద్ గణేష్‌ను దర్శించుకోవాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నానని అన్నారు.

# ఎమ్మెల్యేల పనితీరుపై టీపీసీసీ రిపోర్ట్

- మెజారిటీ ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేదు
- నియోజకవర్గాల్లో ఎక్కువ సమయం గడపాలి
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- మీనాక్షి ఇన్ ఛార్జిగా రావడం తెలంగాణకు శుభసూచకం
- ఈనెలలోనే టీపీసీసీ కార్యవర్గం, విస్తరణకు అవకాశం

**హైదరాబాద్, మహా :** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. మెజారిటీ ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పనితీరును సమీక్షించుకొని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఎక్కువ సమయం గడిపి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈనెలలోనే టీపీసీసీ కార్యవర్గ విస్తరణ, మంత్రివర్గ విస్తరణ పూర్తయ్యే అవకాశం ఉందని.. దీనికి సంబంధించి చర్చలు ఢిల్లీలో ఏఐసీసీ అధిష్ఠానంతో జరిగాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు అందుతున్నాయని, తెలంగాణలో జరిగిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అయితే, పార్టీ బలోపేతం కోసం ఎమ్మెల్యేలు, మంత్రులు సమన్వయంతో పనిచేయాలని, బూత్ స్థాయి నుంచి పార్టీని బలపరచాలని ఆయన ఉద్ఘాటించారు. కాంగ్రెస్‌లో పాత నాయకులు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన కొత్త ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నామని, కొన్ని నియోజకవర్గాల్లో సమస్యలున్నా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు.

**ఈనెలలోనే టీపీసీసీ కార్యవర్గం, విస్తరణకు అవకాశం**

తెలంగాణ మంత్రివర్గంలో 18 మంది సభ్యులకు అవకాశం ఉండగా, ప్రస్తుతం 12 మంది మాత్రమే ఉన్నారు, మిగిలిన ఆరు ఖాళీలను భర్తీ చేయడానికి ఏఐసీసీతో చర్చలు జరుగుతున్నాయని, ఈ విస్తరణలో కుల, ప్రాంతీయ సమతుల్యతను పాటిస్తామని మహేష్‌గౌడ్ తెలిపారు. టీపీసీసీ కార్యవర్గ విస్తరణలో బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియ ఈ నెలలో పూర్తయ్యే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో ఐక్యతను కాపాడటం, స్థానిక ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడం, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడమే తన లక్ష్యమని మహేష్‌గౌడ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ఎదుర్కొనేందుకు పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేస్తామని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే ఆకాంక్షతో పనిచేస్తామని ఆయన ఉద్ఘాటించారు.

# ఒక్క డీఏ ఉద్యోగులను అవమానించినట్లే

(మొదటిపేజీ తరువాయి)

ఐదు గంటల పాటు కేబినెట్‌లో చర్చించి ఒక్క డీఏ ప్రకటించడం అంటే రాష్ట్రంలోని అందరు ప్రభుత్వ ఉద్యోగులను పూర్తిగా అవమానించినట్లే అని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే పెండింగ్‌లో ఉన్న మిగతా డీఏలను కూడా తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే ఆర్ఆర్ ట్యాక్స్ అని ఫేమస్ అయిందని గుర్తుచేశారు. రోడ్లు వేస్తున్నాం.. అది చేస్తున్నామని పనులు సైతం కాగితాల వరకే పరిమితం అయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని కొత్తగా టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్నారని తెలిపారు. ఎవరైతే కమీషన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారో వారికే బిల్లులు క్లియర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో తెలంగాణలో రోడ్ల నిర్మాణం తప్పితే.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి రోడ్ల నిర్మాణం జరగడం లేదని అన్నారు. చిన్న.. సన్న కాంట్రాక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు కూడా వెంటనే చెల్లించాలని డీకే అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణ నీటిహక్కుల కోసం.. తగ్గేదెలే



(మొదటిపేజీ తరువాయి)

తరలించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. జనవరి 22 న జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కు లేఖ రాశాను. మాకు ఏపి నుండి ఎలాంటి ప్రతిపాదన రాలేదని.. వస్తే అన్ని నిబంధనలను పరిశీలిస్తామని.. మే నెలలో తెలంగాణకు పాటిల్ లేఖ రాశారు. చట్టప్రకారం ముందుకు వెళతామని పాటిల్ మాకు హామీ ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా లేఖల్లో సవివరంగా వివరించాం. కేంద్రం .. చట్ట విరుద్ధంగా.. ఏపీకి సహకరిస్తుందని అనుకోవడం లేదు. తెలంగాణ కు అన్యాయం జరిగితే.. ఎంత వరకైనా పోరాడుతాం. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి లు కేంద్రాన్ని ఒప్పించాలి అని అన్నారు.

**కాళేశ్వరంలో వృధా ఖర్చు చేయకుంటే..**

కాళేశ్వరంలో వృధా ఖర్చు చేయకుంటే.. కృష్ణా ప్రాజెక్టులు అన్ని పూర్తి అయ్యేవని, తమ్మిడి హట్టి దగ్గర కాకుండా..మేడిగడ్డ వద్ద కట్టడం ద్వారా 68 వేల కోట్లు కాళేశ్వరం అదనపు ఖర్చు అయ్యిందని, కృష్ణా లో తెలంగాణకు అన్యాయం చేసింది బి ఆర్ ఎస్ అన్నారు. 512 టీఎంసీ ఏపీకి.. తెలంగాణకు 299 టీఎంసీ చాలు అని సంతకం పెట్టింది బి ఆర్ ఎస్ ప్రభుత్వం కాదా..? అప్పుడు మోసం చేసి.. ఇప్పుడు బిఆర్ ఎస్ నేతలు నాటకాలు ఆడుతున్నారన్నారు. ముచ్చుమర్రి ప్రాజెక్ట్ పనులను బీఆర్ ఎస్ ప్రభుత్వం కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదని, రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్ట్ తెలంగాణకు మరణశాసనమన్నారు. ప్రతిరోజూ 3 టీఎంసీ తరలించేందుకు కెసిఆర్ సర్కార్ సహకరించింది నిజమన్నారు.

# రాజన్న కోడెలపై రాజకీయాలొద్దు

## కోడెల దుస్థితికి పాపం కేసీఆర్ పాలనదే

- వేములవాడకు కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా ఇవ్వలే
- పదేళ్లలో దేవాదాయ శాఖలో డెవలప్మెంట్ యాక్టివిటీ జరిగిందా?
- పదేండ్ల అరిష్టపు పాలన ఇప్పుడు బీఆర్ఎస్‌ను వెంటాడుతోంది
- రాష్ట్ర సంపదను ఇష్టారీతిన దోచుకున్న కల్వకుంట్ల దండుపాళ్యం బ్యాచ్
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



**మహా:** రాజన్న కోడెలపై రాజకీయమొద్దని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో వేములవాడ టెంపుల్‌కు ఏం చేశారో చెప్పగలరా? అంటూ ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేములవాడ టెంపుల్‌కి కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదని నిలదీశారు. హామీ ఇచ్చిన నిధులు కేటాయించకపోవడం వల్లనే వేములవాడలో రాజన్న కోడెలకు ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటి ఈ కోడెల దుస్థితికి పాపం కేసీఆర్ పాలనదేనని అన్నారు. అయితే, కోడెల ఘటన జరిగిన వెంటనే తమ ప్రభుత్వం స్పందించిందని అన్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోని ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. అయినా, ప్రతిపక్ష పార్టీలు ఈ విషయంలో బురద రాజకీయం చేయడం సరికాదన్నారు. శుక్రవారం ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ హయాంలో సక్సెస్ ఫుల్‌గా సరస్వతీ పుష్కరాలు నిర్వహించామన్నారు. పుష్కరాలకు 30 లక్షల మంది భక్తులు వచ్చినా ఎక్కడా చిన్న ఇబ్బంది జరగకుండా నిర్వహించామన్నారు. ఇక భద్రకాళి టెంపుల్ విస్తరణ పనులు కోట్లాది రూపాయలతో చేపట్టామన్నారు. యాదగిరిగుట్ట మీద కేసీఆర్ బొమ్మలను చెక్కించుకున్న వాళ్ళకి అసలు దేవుళ్ళ విషయంలో మాట్లాడే అర్హత ఉందా? అని సురేఖ ప్రశ్నించారు. యాదగిరిగుట్టకి తాము రూ. 63 కేజీల బంగారంతో గోపురం తాపడం చేయించామన్నారు. సామూహిక కోటి దిపోత్సవం, పలు నదీ హారతి కార్యక్రమాలు, కాళేశ్వరం, యాదగిరిగుట్టలకు మహా కుంభాభిషేకం చేశామన్నారు. అసలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కార్యక్రమాలు ఏనాడైనా చేశారా? దేవాదాయ శాఖలో డెవలప్మెంట్ యాక్టివిటీ జరిగిందా అంటూ నిలదీశారు.ఇటీవల కాలంలో మన రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై బీఆర్ఎస్ నాయకుల మాటలు, స్పందనలు చూస్తే చాలా హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. అవి చూస్తే తనకు ఒకటే గుర్తుకు వస్తుందని అన్నారు.

**దుస్థితికి కారణం వాళ్లే..**

పాము శివుడిపై ఒట్టేసిందట ఇంకెవరిని కాటు వేసి చంపనని.. ఒక రాబందు మాట ఇచ్చిందట... ఇంకెప్పుడూ చచ్చిన పశువులను పీక్కు తిననని.. ఒక పులి పశ్చాత్తాపం ప్రకటించిదట... తోటి జంతువులను సంహరించనని.. ఈ కట్టు కథలు కల్వకుంట్ల కుట్రలను మన తెలంగాణ రాష్ట్ర ప్రజలు వినాలా? విని నమ్మాలా? అంటూ మంత్రి సురేఖ ప్రశ్నించారు. గత పదేండ్ల పాటు రాష్ట్ర సంపదను ఇష్టారీతిన దోచుకున్న కల్వకుంట్ల దండుపాళ్యం బ్యాచ్.. నేడు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంటే విషపురుగులై.. విషసర్పాలై... రాబంధులై... ఉద్వేగం పేరుతో మనల్ని ఉన్మాదులను చేసే కుట్రకు పాల్పడుతుండటం బాధాకరమన్నారు. కేసీఆర్ కుటుంబంలో అంతర్గత గొడవలతో బీఆర్ఎస్ నాయకులకు ఏం మాట్లాడాలో.. ఏ విధంగా స్పందించాలో అర్థం కావడం లేదన్నారు. వేములవాడలో గోశాలకు ఈ దుస్థితికి రావడానికి కారణం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే కదా అని బీఆర్ఎస్ నేతలు ఆత్మ సమీక్ష చేసుకోవాలన్నారు. వేములవాడ రాజన్న దగ్గర మొక్కులు మొక్కి రూ.100 కోట్లు ఇస్తానని దేవుడిని మోసం చేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌ది కాదా? అని ఆమె ప్రశ్నించారు. అప్పుడు కేసీఆర్ హామీ ఇచ్చినట్లు వేములవాడకు వంద కోట్లు ఖర్చు పెడితే గోశాల కూడా బాగుపడేది కదా సురేఖ చెప్పుకొచ్చారు. కోడెల మొక్కులు, కోడెలు సమర్పించుకోవటం భక్తుల నమ్మకం, విశ్వాసాలకు సంబంధించిందన్నారు. వాటిని కూడా రాజకీయం చేయటం బీఆర్ఎస్ పార్టీ నీచ రాజకీయానికి, ఆ పార్టీ నాయకుల నీచ మనస్తత్వానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. కేసీఆర్ పదేండ్ల అరిష్టపు పాలన ఇప్పటికీ వేములవాడను వెంటాడుతోందన్నారు. ఆ పాపం బీఆర్ఎస్ పార్టీని కూడా వెంటాడుతుందని, అందుకే ఆ పార్టీలో లుకలుకలు తెరపైకి వస్తున్నాయన్నారు. తమ నాయకు రేవంత్ రెడ్డి అన్న సీఎం అయ్యాక వేములవాడకు మాస్టర్ ప్లాన్ ఆమోదించుకున్నామని, వేములవాడ అభివృద్ధికి నిధులు ఇచ్చామన్నారు. రాజన్న టెంపుల్ విస్తరించేందుకు వేగంగా చర్యలు చేపట్టామని గుర్తు చేశారు.



# అది దయ్యాల రాష్ట్ర సమితే



(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మీద సీఎం విమర్శలు, సెటైర్లు సంధించారు. సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన అంశాల విషయానికొస్తే.. 'తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. యాదాద్రి పేరుని యాదగిరిగుట్టగా మార్చాం. తిరుమల మాదిరిగా యాదగిరిగుట్ట అభివృద్ధి, టీటీడీ మాదిరిగా వైటీడీ ఏర్పాటు చేశాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపుర నిర్మాణం, కొండపై భక్తులు నిద్రించేలా, ఆటోలు నడిచేలా చేశాం. త్వరలో యాదగిరిగుట్ట ఆలయ కమిటీ ఏర్పాటు చేస్తాం. స్థానిక విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి తీసుకెళ్తాం.' అని ప్రసంగంలో పేర్కొన్నారు. గంధమల్ల ప్రాజెక్టును గతంలో ఎందుకు పూర్తిచేయలేదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్, గత బీఆర్ఎస్ సర్కారుని నిలదీశారు.

**బంగారు తెలంగాణ ముసుగులో..**

ఎవరు అడ్డుపడినా మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతామని, నల్గొండ రైతులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. దేశంలో సబర్మతి, గంగా నదులను ప్రక్షాళన చేయగలిగినప్పుడు, మూసీ నదిని ఎందుకు శుద్ధి చేయకూడదు?" అని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం బెంగళూరు, చెన్నై, ఢిల్లీ నగరాలతో పోటీ పడదని, టోక్యో, న్యూయార్క్ నగరాలతోనే పోటీ పడి అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్రంగా విరుచుకుపడ్డారు. "బంగారు తెలంగాణ ముసుగులో పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నవారా నన్ను ప్రశ్నించేది? వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పి అక్కడి ఇళ్లన్నీ కూలగొట్టారు. ఆ తర్వాత కేసీఆర్ ఆ గ్రామాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారు. విద్యార్థులు, రైతులు, ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నారు" అని ఆయన ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కుర్చీలో కూడా కూర్చున్నా..**

రాష్ట్ర బడ్జెట్ రూ.20 లక్షల కోట్లు ఉంటే, కేవలం రూ.2 వేల కోట్లతో పూర్తి చేయాల్సిన ఎస్సెల్బీసీ ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. పదేళ్లలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదు. యాదగిరిగుట్టలో అపచారాలకు పాల్పడినందుకే బీఆర్ఎస్ పరిస్థితి ఇలా తయారైంది. మీరు చేసిన పాపాల వల్లే ఈ దుస్థితి వచ్చింది" అని సీఎం అన్నారు. తమ పార్టీలో దెయ్యాలు చేరాయని ఆ పార్టీ నాయకురాలే స్వయంగా చెప్పారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దెయ్యాల నేత ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారు. బీఆర్ఎస్ కాదు.. అది డీఆర్ఎస్.. అంటే దెయ్యాల రాజ్య సమితి. ఈ కొరివి దెయ్యాలను తరిమికొట్టే బాధ్యత నేను తీసుకుంటాను. ఇందుకు పార్టీ కార్యకర్తల పూర్తి సహకారం కావాలి" అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తనను జైలుకు పంపిన వారిని గద్దె దించుతానని శపథం చేశానని, ఆ విధంగా తన జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకున్నానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తనకు ఇతర కోరికలేమీ లేవని, నన్ను జైలుకు పంపిన వ్యక్తిని పదవి నుంచి తొలగించాలనుకున్నానని తెలిపారు. పట్టుదలతో వారిని గద్దె దించడమే కాకుండా ఆ కుర్చీలో కూడా కూర్చున్నానని, నా జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకున్నానని పేర్కొన్నారు. ఇకపై మీ (ప్రజలు) లక్ష్యాలను నెరవేర్చడానికే ఒక సోదరుడిగా కష్టపడతానని, నన్ను జైల్లో పెట్టిన వ్యక్తిని పడగొడతానని జైలు నుంచి బయటకు వచ్చిన రోజే తొడగొట్టి చెప్పాను అని గుర్తు చేసుకున్నారు.

**యాదగిరి యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం..**

యాదగిరిగుట్టను యాదాద్రిగా మార్చిందని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు పిలుచుకునే యాదగిరిగుట్టగానే మార్చామని రేవంత్ రెడ్డి అన్నారు. ఇక తిరుమలలో ఎస్వీ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లుగానే యాదగిరిగుట్టలో కూడా యాదగిరి యూనివర్సిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. మెడికల్ , ఇంజనీరింగ్ కాలేజీలతో పాటు అన్నీ విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. భక్తుల ఆశయాలకు తగినట్లుగానే ఆలయంలో పనులు చేపట్టామని యాదగిరిగుట్ట నరసింహస్వామి ఆశీస్సులతో సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామన్నారు. గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటని రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు.

**సీఎం శంకుస్థాపన పనుల వివరాలు:**

- రూ. 574.56 కోట్లతో గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కు శంకుస్థాపన
- రూ.183 కోట్లతో మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.25.50 కోట్లతో యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని వార్డులో వాటర్, డ్రైనేజీ, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం
- రూ.7.50 కోట్లతో కొలనుపాక గ్రామంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం
- రూ.6 కోట్లతో కాల్వపల్లి గ్రామంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం
- రూ.8.25 కోట్లతో మోటకొండూరు మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ నిర్మాణం
- రూ. 22.75 కోట్లతో దాతర్పల్లి గ్రామంలో 20 వేల మెట్రిక్ సామర్థ్యం గల గోడౌన్ల నిర్మాణం
- రూ. 21.14 కోట్లతో ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్లో బీటీ రోడ్ల నిర్మాణం
- రూ.2.75 కోట్లతో ఆలేరు మార్కెట్ కమిటీలో 2500 మెట్రిక్ సామర్థ్యం గల గోడౌన్ల నిర్మాణం

# పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు

## పేదలు ఉన్నచోటే జి+3 పద్ధతిలో నిర్మాణం

హైదరాబాద్‌కు దూరంగా ఇండ్లిస్తే జీవనోపాధికి ఇబ్బంది

తక్షణమే లబ్దిదారులను గుర్తించి ప్రక్రియ ప్రారంభించాలి

పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్నదే లక్ష్యం: మంత్రి పొంగులేటి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష



**మహా:** హైదరాబాద్ నగరంలోని మురికి వాడల్లో పేదలు ఉన్నచోటే జి+3 పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాలలో ఒక కొలిక్కి తీసుకువచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని తెలిపారు. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్‌కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని అన్నారు. హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42 వేల ఇండ్లను నిర్మించగా సుమారు 19 వేల మంది మాత్రమే అక్కడికి వెళ్లారు. ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన జరుపగా కేవలం 13 వేల మంది మాత్రమే ఆ నివాసాలలో ఉంటున్నట్లు తేలిందన్నారు.

**గిరిజనులకు 22,016 ఇండ్లు..**

తొలివిడతలో హైదరాబాద్‌లో 16 మురికివాడలను గుర్తించామని, అలాగే వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ కరీంనగర్ తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏండ్ల తరబడి నిలువ నీడలేక తలదాచుకోవడానికి గూడు లేని చెంచులకు సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మున్ననూరు నాలుగు ఐటీడీఏ పరిధిలోగల చెంచు, కొలం, తోటి, కొండరెడ్లకు 13,266 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని అలాగే రాష్ట్రంలోని 16 ఎస్టీ నియోజకవర్గాలకు ఇప్పటికే 8,750 ఇండ్లు మంజూరు చేశామని దీనితో కలిపి గిరిజనులకు ఇంతవరకు 22,016 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ఇండ్లకు తక్షణమే లబ్దిదారులను గుర్తించి ఇండ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

**ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు..**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇండ్ల నిర్మాణం జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదవాళ్ల ఇంటికోసం ఐదు లక్షల రూపాయిలు ఖర్చు చేయడం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

# కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు

- ప్రభుత్వం రూ. 25 వేల కోట్ల స్కామ్ చేసిందని ఆరోపణలు
- ఆత్రం సుగుణ ఫిర్యాదుతో ఉట్నూర్ పీఎస్‌లో కేసు
- ఆ కేసును కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు
- హైకోర్టు తీర్పు సవాల్ చేస్తూ సుప్రీం ఆశ్రయించిన సుగుణ
- పిటిషన్‌పై విచారణ.. మాజీ మంత్రికి నోటీసులు
- నాలుగు వారాల్లోగా తమ స్పందన తెలపాలని ఆదేశాలు

**మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు షాక్ తగిలింది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25 వేల కోట్ల అవినీతికి పాల్పడిందంటూ గతంలో తీవ్ర ఆరోపణలు చేసిన కేటీఆర్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయనపై నమోదైన కేసులో ఈ పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదైంది. అయితే, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువడింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆత్రం సుగుణ సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్‌పై ప్రతివాదిగా ఉన్న కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని కేటీఆర్‌ను ఆదేశిస్తూ, తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

**మూసీ ప్రక్షాళన పేరుతో..**

మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని కేటీఆర్ గతంలో ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరుగగా.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ కేటీఆర్‌కు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

# అన్ని సమస్యలకు చెక్!

## నేతల అభిప్రాయాలు తీసుకున్న మీనాక్షి

- పది రోజులుగా పార్టీ నేతలతో వరుస సమీక్షలు
- వాటిపై సీఎం రేవంత్ రెడ్డితో మీనాక్షి నాటరాజన్ రివ్యూ
- దాదాపు గంటపాటు సమావేశంలో చర్చించిన నేతలు
- తాజా రాజకీయాలు, కేబినెట్ విస్తరణపై చర్చ
- పీసీసీ కమిటీల నియామకంపై సమావేశంలో డిస్కషన్

**మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో వారు సమావేశమయ్యారు. గత పది రోజులుగా పార్టీ నేతలతో మీనాక్షి వరుస సమీక్షలు నిర్వహించారు. పార్టీ నేతల అభిప్రాయాలను సీఎం రేవంత్ రెడ్డితో మీనాక్షి నటరాజన్ చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి.. అలాగే అసెంబ్లీకి సంబంధించి నేతలతో ఉమ్మడి జిల్లాలకు కొంతమందిని అబ్జర్వర్స్‌ను నియమించారు. వారం దరితో వరుసగా పది రోజుల పాటు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ విషయాలపైన ఇద్దరు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమీక్షల వేళ పార్టీ కేడర్ నుంచి వచ్చిన ఫిర్యాదులు.. ప్రస్తావించిన అంశాలపైన చర్చించి రోడ్ మ్యాప్ ఫిక్స్ చేసినట్లు సమాచారం.



## సోషల్ మీడియాపై అవగాహన..

పార్టీలో కొన్ని నియోజకవర్గాల్లో ఆధిపత్యపోరుకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జిల్లాలు, నియోజకవర్గాల్లో నేతలు సోషల్ మీడియాలో బలహీనంగా ఉన్నారని, చాలా మందికి సోషల్ మీడియాపై అవగాహన లేదని గుర్తించినట్లు మీనాక్షీ వివరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి వివరాలు తెలియవని, వాటిపై వారికి అవగాహన లేకపోవవడంతో జనాలకు వివరించలేకపోతున్నారని మీనాక్షికి ఫిర్యాదులు అందాయి. ఈ విషయాలను సీరియస్‌గా పరిగణించి.. అవసరమైన కార్యాచరణ ఖరారు చేయాలని ఇరువురు నేతలు డిసైడ్ అయ్యారు. ఇదే సమయంలో కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతల వల్ల పాత నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని దీనికి చెక్ పెట్టేలా నిర్ణయాలు ఉండాలని నిర్ణయించారు. త్వరలోనే పార్టీ నియోజకవర్గ నేతల భేటీలు నిర్వహించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

# ట్రంప్ దెబ్బకు ఢీలా పడ్డ అమెరికా జాబ్ మార్కెట్

## ఏప్రిల్‌లో 1.77 లక్షల జాబ్స్ భర్తీ..

అమెరికా కంపెనీలపై ట్రంప్ ఎఫెక్ట్


(మొదటిపేజీ తరువాయి)

హార్వర్డ్ లాంటి ప్రఖ్యాత యూనివర్సిటీ నుంచి విదేశీ విద్యార్థుల బహిష్కరణ, అమెరికా ప్రభుత్వ ఉద్యోగుల ప్రక్షాళన వంటి వ్యవహారాలతో గందరగోళం నెలకొంది. ఈ అంశాల ప్రభావంతో సందిగ్ధంలో పడిన అమెరికా సంస్థలు ఉద్యోగాల భర్తీలో జోరును తగ్గించాయి. ఫలితంగా మే నెలలో ఉద్యోగాల భర్తీ గణనీయంగా తగ్గిపోయింది. ఈ అంశానికి అద్దంపట్టే ఉద్యోగ భర్తీ గణాంకాలను శుక్రవారం అమెరికా కార్మిక శాఖ విడుదల చేసింది.

నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తుల వెల్లువ పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతం అమెరికాలో నిరుద్యోగ రేటు అత్యంత కనిష్ఠ స్థాయిలో 4.2 శాతంగా ఉందని ఓ సర్వేలో తేలింది. నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తులు సమర్పిస్తున్న అమెరికన్ల సంఖ్య మే నెలలో గణనీయంగా పెరిగింది. ఎనిమిది నెలల కిందటి గరిష్ఠ స్థాయిలో నిరుద్యోగ భృతి దరఖాస్తులు పోటెత్తాయి. "ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉద్యోగ ఖాళీలు అనూహ్యంగా 74 లక్షలకు పెరిగాయి. అయితే అదే నెలలో భారీగా ఉద్యోగ కోతలు సైతం జరిగాయి. పెద్దసంఖ్యలో అమెరికన్లు ఉద్యోగాలను వదిలేయాల్సి వచ్చింది. మరింత మెరుగైన ఉద్యోగ అవకాశాల కోసమే ఉద్యోగాలను వదిలారనే అంచనాలను వెలువడ్డాయి" అని గత మంగళవారం వెలువడిన అమెరికా కార్మిక శాఖ నివేదికలో ప్రస్తావించారు.

### సుంకాల భారంతో ఉద్యోగాల భర్తీ డౌన్

విదేశాల నుంచి అమెరికాకు వచ్చే దిగుమతులపై ట్రంప్ విధిస్తున్న భారీ పన్నుల వల్ల అమెరికా కంపెనీలపైనే భారం పెరుగుతుందని పలువురు ఆర్థికవేత్తలు అంటున్నారు. విదేశాల నుంచి దిగుమతి



చేసుకునే ముడి సరుకులు, పరికరాలు, విడి భాగాలు, సామగ్రిపై భారీగా విధిస్తున్న సుంకాల వల్ల అమెరికా కంపెనీల ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయని విశ్లేషించారు. ఈ ప్రతికూల ప్రభావాన్ని తట్టుకునే క్రమంలో ఆయా కంపెనీలు ఉద్యోగాల భర్తీని తగ్గిస్తాయని, అవసరమైతే ఉద్యోగకోతలూ విధిస్తాయని పేర్కొన్నారు. అమెరికా కంపెనీలు ఈ ఏడాదిలో ఇప్పటివరకు ప్రతినెలా సగటున 1.44 లక్షల మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నాయి. గతేడాది ప్రతీ నెల సగటున 1.68 లక్షల మందిని రిక్రూట్ చేసుకున్నారు. ఉద్యోగాల భర్తీలో వేగం తగ్గింది అనేందుకు ఇదే సూచిక అని పరిశీలకులు చెబుతున్నారు. అక్రమ వలసదారులపై ట్రంప్ సర్కారు కఠిన చర్యల వల్ల, అమెరికాలోని కంపెనీలకు తగిన సంఖ్యలో కార్మికులూ దొరికే అవకాశం ఉండదని అభిప్రాయపడుతున్నారు.

# ఉత్తమ్ ఏది చెప్పినా అబద్ధమే

## అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌నే మించిపోతున్నారు

ఇద్దరు చంద్రబాబుకు దాసోహం అయ్యారు

చంద్రబాబు ఎదురించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి లేదా?

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలపై హరీశ్ రావు కౌంటర్



**మహా:** రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశం నిరాశపరిచిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు దాసోహమయ్యారని మాజీ మంత్రి హరీష్‌రావు ఫైర్ అయ్యారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన తెలంగాణ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన క్యాబినెట్ సమావేశం వలన ఎటువంటి ప్రయోజనం లేకపోగా, తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ఘనంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిగా మరచిపోయిందని, రాష్టంలోని కాంగ్రెస్ నేతలు గాలి మోటార్‌పై తిరుగుతూ, గాలి మాటలు మాట్లాడుతున్నారని హరీష్‌రావు ఆరోపించారు. తాము ఏదో చేస్తున్నామని చెప్పుకునేందుకు క్యాబినెట్ మీటింగ్ నిర్వహించారని, అది తీవ్ర నిరాశనే మిగిల్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశారని, దీనిపై క్యాబినెట్‌లో ఐదు గంటలపాటు చర్చించడం అవసరమా అని హరీష్ రావు ప్రశ్నించారు.

**రేవంత్ రెడ్డిని మించిపోయిండు..**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను నిట్ట నిలువునా ముంచుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు తక్షణమే మూడు డీఏలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదన్నారు. సక్రమంగా పనిచేస్తున్న ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం కేసులు పెడుతున్నదని, పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి, గ్రామాభివృద్ధికి పాటు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలు చెప్పడంలో సీఎం రేవంత్ రెడ్డిని మించిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏది మాట్లాడిన అబద్ధమేనని, సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ కుమార్‌లు ఏపీ సీఎం చంద్రబాబుకు దాసోహం అయ్యారని హరీష్ రావు ఆరోపించారు. రైతులను దెబ్బతీసేలా క్రాఫ్ హాలీడేను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని, 65 టీఎంసీల నీటిని ఉపయోగించకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అడ్డుకున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. నీతి అయోగ్ సమావేశంలో రేవంత్ రెడ్డి ప్రధానిని ఎందుకు ప్రశ్నించలేదని హరీష్‌రావు నిలదీశారు. అలాగే చంద్రబాబు ఎదురించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. గోదావరి బనకచర్ల కోసం బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టు వెళ్లనున్నదని తెలిపారు. ఈ విషయంలో బీజేపీ మాట్లాడకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. శ్రీశైలం రైడింగ్ పాజెక్టు పనులు నిలిపివేయాలని కోరారు. కాళేశ్వరం కుప్ప కూలిందని చెబుతున్న సీఎం రెవంత్ రెడ్డి గంగమల్లకు నీటిని ఎక్కడి నుంచి తెస్తారని హరీశ్ రావు ప్రశ్నించారు.





# సంబరాల వేళ మృత్యు హేల

**ఏ ఉత్సవం అయినా , ఏ క్రీడా పోటీ అయినా, ఏ సభ అయినా,సినిమా వేడుక అయినా —అవి ప్రజల ఆనందోత్సాహాలకు కాకుండా, అనేక కుటుంబాలకూ విషాద దృశ్యాలుగా,మృత్యు హేల ముఖ చిత్రాలుగా మిగిలిపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం అదే సమయంలో జనం శ్రుతిమించిన అత్యుత్సాహం. ఇటీవల బెంగళూరులో జరిగిన చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట ఘటన ఈ విషాద మృత్యు ఘటనలలో ఒక తాజా దృశ్యం మాత్రమే! . కానీ దీని వెనుక ఉన్న మానవీయ తప్పిదాలు,, పరిపాలనా వైఫల్యాలు మనం నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.**

### చిన్నస్వామి స్టేడియం -దుర్ఘటన

ఐపిఎల్ సందర్భంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్ సిబి) హోమ్ మ్యాచ్ టికెట్ల కోసం వేలాదిగా యువత, అభిమానులు స్టేడియం వద్ద గుమికూడారు. ఆన్‌లైన్ టికెట్ల అందుబాటు లేనందున ఫిజికల్ కౌంటర్లపైనే ఆధారపడిన ఈ ప్రక్రియలో అధికారులు ఎలాంటి ముందస్తు భద్రతా చర్యలు తీసుకోకపోవడం, నియంత్రణ విధించకపోవడం వల్ల దారుణ విషాదం తలెత్తింది. ఈ ఘటనలోరాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మందిప్రాణాలు కోల్పోయి, 50 మందికి పైగా గాయపడ్డారు మరుసటి రోజు, ఐపీఎల్ జట్టు బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి ₹10 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించింది. కాని పోయినప్రాణాలు , జరిగిన విషాదం మాటేమిటి? మానసికంగా ఎంతోమంది షాక్‌కు గురయ్యారు. ఇది కచ్చితంగా నివారించదగ్గ ప్రమాదం. కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల, జన పరిస్థితి గమనించి సంయమనం పాటించకపోవడం వల్ల అది ప్రాణాంతకంగా మారింది.

### గతంలోనూ అనేకం

ఇటీవల హైదరాబాద్ లో అల్లుఅర్జున్ పుష్ప సినిమా విడుదల సమయలో అతన్ని చూడడానికి జనం ఎగబడటంతోతొక్కిసలాట జరిగి ఒక మహిళ మరణించింది .ఆమె కుమారుడు మృత్యుముఖం వరకూ వెళ్లిబతికాడు. తిరుపతి తిరుమల కొండలపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం వందలాది మంది భక్తులు తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మరణించగా, అనేక మంది గాయపడ్డారు.ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లనే ఈ దుర్ఘటన జరిగింది .

### గోదావరి పుష్కరాలు – 2015, రాజమహేంద్రవరం

పుష్కరాల ప్రారంభ వేళ, నదిలో పుణ్యస్నానం కోసం లక్షలాది భక్తులు గోదావరి ఒడ్డున కదలికలు లేకుండా నిలబడ్డారు. అధికారుల నిర్లక్ష్యం, వీఐపీకి మార్గం వదలడం, సామాన్య భక్తులను కట్టడి చేయకపోవడం వల్ల 27 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన కేవలం ఆంధ్రప్రదేశ్‌కి పరిమితం కాలేదు.అంతర్జాతీయంగా సంచలన వార్తా అయింది

### రైల్వే స్టేషన్ బ్రిడ్జి తొక్కిసలాట – ముంబై 2017

ముంబై సబర్బన్ రైలు నెట్‌వర్క్‌లోని ఎల్ఫిన్‌స్టోన్ రోడ్ స్టేషన్ ఇప్పుడు ప్రభాదేవి స్టేషన్. 1853 నుండి 1860 వరకు బాంబే ప్రెసిడెన్సీ గవర్నర్ లార్డ్ ఎల్ఫిన్‌స్టోన్ పేరు మీద ఉన్న ఈ స్టేషన్‌కు స్థానిక దేవత ప్రభాదేవి గౌరవార్థం వలసవాద పేరును తుడిచివేయడానికి ప్రభాదేవిగా పేరు మార్చారు.ఈ స్టేషన్ వద్ద వర్షం సమయంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌పై అకస్మాత్తుగా జనం పరుగులు పెట్టి ఎదురుగా ఉన్నవారిని తొక్కివేశారు.. దీనివల్ల 22 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అంతకు ముందే ఎన్నోసార్లు , ఈ బ్రిడ్జి మరమ్మత్తుల కోసం పలు విజ్ఞప్తులు ఉన్నా అధికారులు పట్టించుకోలేదు.

### సబ్బండ్లు, ఉత్సవాలు, ర్యాలీలు – వందల సంఘటనలు

భక్తి పారవశ్యంలో లేదా నాయకులు ,క్రీడాకారులు సినీ హీరోలు పట్ల అభిమానంతో ప్రజలు తండోపతండాలుగా వచ్చే వేళ, సకాలంలో సరైన జాగ్రత్తలు ,హెచ్చరికలు లేకపోవడం వల్ల తరచు ప్రాణ నష్టం జరుగుతూ వుంది . . 2008లో నందీదేవాలయం వద్ద, 2011లో సిర్పూర్ గద్వాల్‌లో జరిగిందీ విధమైన ఘోర సంఘటనలు కూడా ఇలాంటివే!

### సమస్య వేరే కాదు – పాలనా వైఫల్యమే!

ఇలాంటి సంఘటనల సందర్భంలో ప్రభుత్వాలు తరచు చెప్పే మాట “అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం , కానీ అనుకోకుండా జరిగింది” అనే మాటలు. కానీ నిజానికి, ఇవన్నీ చాలావరకు అనుకోకుండా జరుగుతున్నవేమీ కావు. వాటికి అనేక రోజుల ముందు నుంచే ప్రచారం జరుగుతుంది.లేదా సమాచారం వుంటుంది. అన్వేషిస్తే వేస్తే ప్రమాదం గ్రహించే అవకాశం వుంటుంది . మరి అనుకోకుండా తొక్కిసలాట ఎలా జరుగుతుంది?

**ప్రణాళిక లోపం:**
పోలీస్ బందోబస్తు సరిపడినంత ఉండకపోవడం, మార్గదర్శకాలు లేకపోవడం.

**నిలువెత్తు నిర్లక్ష్యం :**
గతంలో వివిధ ఘటనలు కనీసం అధ్యయనం చేయడమే వుండదు .

**విపత్తు నిర్వహణ విభాగాల నిద్ర :**
ఎమర్జెన్సీ వైద్యం, హెల్ప్‌డెస్క్‌లు, ట్రాఫిక్ రూట్ మోడిఫికేషన్లు మసిపట్టిన నిబంధనలు మాత్రమే.

**సాంకేతిక వైఫల్యం :**
టికెట్ బుకింగ్ వ్యవస్థలలో సాంకేతిక లోపాలు ప్రజలను చంపేస్తున్నాయి. ఒక్కోసారి క్యూ టోకెన్లాంటి వ్యవస్థలు కూడా అమలవడం లేదు.

**జనం వేలం వెర్రి**
ఇక్కడ జనం వైఖరినీ విమర్శించక తప్పదు. ఇలాంటి భారీ కార్యక్రమాల్లో సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ఇప్పటి సోషల్ మీడియా రీల్స్ , సెల్ఫీ మానియా, హీరోల క్రేజ్ ఇలా పెరిగిపోయిన ప్రభావంతో, హంగామా చేయడం, కూల్చేయడం, ఇతరులను తొక్కేయడం వంటి విపరీత పోకడలు నానాటికీ మరింత పెరిగిపోతున్నాయి. ఇలాంటి కారక్రమాలలో జాగ్రత్తలు కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ఒక సాంఘిక బాధ్యతగా ప్రతి వ్యక్తి భావించాలి .

**పరిష్కార మార్గాలు – పునరాలోచన**
సాంకేతిక సౌకర్యాలు: ముందస్తుగా టైమ్‌స్లాట్ టికెటింగ్, వర్చువల్ క్యూలైన్‌లు, GPS ఆధారిత కంట్రోల్, డ్రోన్ని ఘా అవసరం.

**అవగాహన:**
ర్యాలీలు, ఉత్సవాలు, క్రీడా టోర్నీల సమయంలో ప్రజల్లో వివేచనతో వ్యవహరించేలా శిక్షణ ఇవ్వాలి.

**దృఢమైన ప్రణాళిక:**
పెద్ద ఈవెంట్ అనగానే ;డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్; తప్పనిసరిగా అమలులో ఉండాలి.

**నిబంధనలు:**
ప్రజా గుంపుల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక చట్టాలు, స్టాంపీడ్‌రెస్పాన్స్ యూనిట్లు ఏర్పాటుచేయాలి. చిన్నస్వామి స్టేడియం ఘటన ఒక హెచ్చరిక మాత్రమే కాదు——భవిష్యత్‌లో జరగబోయే మరిన్ని ప్రమాదాలకు సంకేతం. ఇవన్నీ మనం ఇప్పటికైనా శ్రద్ధగా పరిశీలించి, ఇప్పటికైనా మార్చుకోకపోతే, సంబరాలు సంతోషం బదులు విషాదాన్నే మిగుల్చుతాయి .ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ప్రభుత్వం నిర్లక్ష్యం తక్షణమే సరిచేసుకోవాలి. ప్రజలు తమ మానసిక స్థితిని నియంత్రించుకోవాలి. అప్పుడే ఉత్సవాలను ఉత్సాహంతో ‘ఉత్సవాలుగా’ జరుపుకునే అవకాశం ఉంటుంది .

**- డాక్టర్ పి. విజయబాబు**
సీనియర్ సంపాదకులు





# నేడే బక్రీద్...

## త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

### ఇబ్రహీంను స్మరించుకొని శక్తి మేరకు ఖుర్బానీ పంపిణీ

### అలైబాలైతో సంతోషం పరుచుకుంటారు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సామాజిక రుగ్మతల నుంచి మానవాళిని జాగృతపరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ భూమిపైకి 80 వేల మంది ప్రవక్తల్ని పంపినట్లు ఖురాన్ చెబుతోంది. వారిలో ఒకరు ప్రవక్త హజరత్ ఇబ్రహీం. అయితే, జీవనాన్ని సన్మార్గంలో గడపాలని ప్రవక్తలు మానవాళికి బోధిస్తున్న క్రమంలోనే వారి విశ్వాసాన్ని కూడా అల్లాహ్ అనేక రకాలుగా పరీక్షించేవారు. ఈ క్రమంలో ప్రవక్త ఇబ్రహీం చిరస్థాయిగా నిలిచిపోవడానికి అల్లాహ్ మరో పరీక్ష విధించాడు. తన కొడుకును బలివ్వమని కోరాడు. ఈ విషయాన్ని తన కుమారుడైన ఇస్మాయిల్ సంతోషంగా అంగీకరించడంతో అతడిని బలిచ్చేందుకు మీనా కొండ వద్దకు తీసుకెళ్తాడు. అక్కడ కళ్లకు తెల్లని గుడ్డ కట్టుకుని కుమారుడిని శిరచ్ఛేధనకు కత్తి ఎత్తగానే చలించిపోయిన అల్లాహ్. ఇస్మాయిల్ స్థానంలో గొర్రె పొట్టేలును ఉంచాడు. ఇస్మాయిల్ సజీవంగా కనిపించడంతో ఇబ్రహీం ఆశ్చర్యానికి గురయ్యాడు. త్యాగానికి పరాకా నిలిచిన ఇబ్రహీం జీవితాన్ని స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటారు.

**బక్రీద్ ఆచరణ..!**

ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జిల్ హజ్ పర్వదినాన్ని జరుపుకుంటారు. ఖుర్బానీ చేసిన అనంతరం ముస్లింలు హజ్రత్ ఇబ్రహీం మాదిరిగానే దైవప్రీతి కోసం తమ ధనాన్ని, ప్రాణాన్ని సమస్తమూ త్యాగం చేయడానికి సిద్ధమేనని నిరూపించుకుంటారు. ఖుర్బానీ ఇస్లాం అబలలో ఒక ముఖ్యమైనదని దైవ ప్రవక్త మహమ్మద్ (సతానం) 3 ఆదేశించాడు. బక్రీద్ రోజున ముస్లింలు నమాజ్ చేసిన అనంతరం ఖుర్బానీ (మాంసం) ఇస్తారు.

**ఖుర్బానీతో లాభాలు..!**

బక్రీద్ పండుగ రోజున ఖుర్బానీ ఇచ్చే ముస్లిం సోదరులకు ఎంతో పుణ్యఫలం లభిస్తుందట. ఖుర్బానీ ఇచ్చే వారికి జంతువులపై ఉండే వెంట్రుకలకు పది రెట్లు పుణ్యఫలాలు దక్కుతాయన్నది సారాంశం. ఖుర్బానీ ఇచ్చే అతను తను " బలి చేసే జంతువు రక్తం భూమి మీద పడకముందే తాను చేసిన పాపాలకు మోక్షం లభిస్తుందని వారి నమ్మకం. పండగ రోజు నమాజ్ అనంతరం ఆర్థిక స్థోమత ఉన్న వారంతా విధిగా ఖుర్బానీ ఇవ్వాలి. అందు కోసం పూర్తిగా ఒక సంవత్సరం నిండిన ఆరోగ్యకరమైన మేక లేదా గొర్రె ఏదైనా దైవ మార్గంలో సమర్పించాలి.

# భారీ మొత్తంలో నకిలీ పురుగు మందులు,విత్తనాలు పట్టివేత

### నకిలీ పురుగు మందులు,విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలు అరెస్టు

### వివరాలు వెల్లడించిన వరంగల్ పోలీస్ కమిషనర్



**హన్మకొండ మహా;** రెండు వేర్వేరు సంఘటనల్లో అమాయక వ్యవసాయదారులను లక్ష్యంగా చేసుకోని ప్రముఖ కంపెనీల పేర్లతో పాటు గడువు తీరిన పురుగు మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఏడుగురిని ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్, పరకాల, గీసుగొండ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ రెండు ముఠాల నుండి పోలీసులు సుమారు 63లక్షల 62వేల రూపాయల విలువ గల నకిలీ, కాలం తీరిన పురుగు మందులు, 166 కిలోల నకిలీ విత్తనాలు, 8వందల లీటర్ల గడ్డి మందుతో పాటు, నకిలీ పురుగు మందుల తయారీకి అవసమయిన సామగ్రితో పాటు ఏడు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1) జయదీప్ గౌతమ్, వయసు 33, మేడ్చల్ మల్కాజిగిరి, 2) ముద్దంగుల ఆదిత్య ,వయసు 32, మోహిదీపట్నం హైదరాబాద్, 3) మాచబోయిన తిరుపతి, వయసు 35, నాగారం గ్రామం పరకాల మండలం. 4) అన్నం కుమారస్వామి ఇవయసు 42, పాపయ్యపల్లి చేల్పూర్ గ్రామం ములుగు ఘన్‌పూర్ మండలం.5.బెరి రెడ్డి మర్రి రెడ్డి, వయస్సు 42, ఎల్కతుర్తి హవేలీ,గీసుగొండ మండలం,వరంగల్ జిల్లా, 6.తుమ్మ గుండ్ల సందీప్ రెడ్డి, వయస్సు 37, సంగారెడ్డి జిల్లా, 7.తుమ్మగుండ్ల విజయ్ జోసెఫ్, వయస్సు 36, సంగారెడ్డి జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలు వెల్లడిస్తూ.. పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, పరకాల పోలీసులు, వ్యవసాధికారులు సంయుక్తంగా కలిసి ప్రధాన నిందితుడు నాగారం గ్రామానికి చెందిన మాబొయిన తిరుపతి ఇంటిపై పోలీసులు దాడి చేసి నకిలీ, కాలం తీరిన పురుగు మందులను పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడిని పోలీసులు విచారించగా నిందితుడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు హైదరాబాద్‌లో మోహిదీపట్నం ప్రాంతంలో నకిలీ పురుగు మందులు తయారు చేస్తున్న గొదాంపై దాడి చేసి పోలీసులు సుమారు 57లక్షల 44వేల రూపాయల నకిలీ,కాలం తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకోవడంతో పాటు జయదీప్ గౌతం, ఆదిత్య,కుమారస్వామిలను పోలీసులు అరెస్టు చేసారు. మరో సంఘటనలో పోలీసులకు అందిన సమాచారంతో గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్కతుర్తి హవేలీ ప్రాంతంలో బెరి రెడ్డి మర్రి రెడ్డి ఇంటిపై దాడి చేసి ఒక కిలో నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని పోలీసులు విచారించగా నిందితుడు ఇచ్చిన సమాచారం సంగారెడ్డి జిల్లా చింతల చేరువు గ్రామానికి చెందిన తుమ్మగుండ్ల సందీప్ రెడ్డి, తుమ్మగుండ్ల విజయ్ జోసెఫ్ ఇండ్ల సుమారు 6లక్షల 18వేల రూపాయల విలువ గల 166 కిలోల నకిలీ విత్తనాలతో పాటు 8వందల లీటర్ల గడ్డి మందును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచన టాస్క్‌ఫోర్స్ ఏసిపి మధుసూధన్, పరకాల, మామూనూర్ ఏసిపి వెంకటేష్ , సతీష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు బాబులాల్, సార్లరాజు, రంజిత్, పరకాల ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, ఏఏఓ సల్మాన్ పాషాతో పాటు, టాస్క్‌ఫొర్స్,పరకాల పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బందిని పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ మీడియా సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, వ్యవసాయాధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు

### జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

- అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్
- వివరాల నమోదులో తప్పిదాలు లేకుండా జాగ్రత్తగా ఉండాలి
- అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలి
- తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తులను పరిష్కరించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

రెవెన్యూ సంబంధిత భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు వేదికలుగా నిలువాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం కొత్తూర్ మండలం మల్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా? అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్ లను, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. భూ సమస్యలున్న ప్రజలు ఈ సదస్సులకు హాజరై దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులను పదేపదే తిప్పుకోకూడదని, సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యవహరించాలని రెవెన్యూ బృందాలకు సూచించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులు ముగిసిన మీదట క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని, అప్పుడే భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కొందరు రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని వారికి తెలిపారు. అందులో ముగ్గురు రైతులు మేం ముగ్గురం అన్నదమ్ములం తమకు ఉన్న భూమి ఒక్కరి పేరుమీదకు మారిందని ఒక్కరికే రైతు భరోసా వస్తుందని, భూమి ముగ్గురి పేర్ల మీదకు మార్చాలని, అట్టి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ కు తెలిపారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఒకరి భూమికి ఉన్న హద్దులు, గట్టు, బాట లేకుండా ఆక్రమించుకొని సాగు చేయడం జరుగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అందుకు కలెక్టర్ స్పందిస్తూ అట్టి భూమిని సర్వేయర్ తో సర్వే చేయించి హద్దులు, గట్టు ఏర్పాటు చేయించాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సదస్సులో కలెక్టర్ వెంట షాద్ నగర్ ఆర్డీఓ సరిత, తహశీల్దార్ రవీందర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ జంగయ్య, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు యూనిఫాంలు నోటి పుస్తకాలు అందించాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** పాఠశాలలు ప్రారంభించే నాటికి పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు విద్యార్థినీ, విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి, పిడి డిఆర్డిఏ, పిడి మెప్మా, ఇతర సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ సి.నారాయణరెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు స్కూల్ యూనిఫాంలు 12వ తేదీ నాటికి అన్ని సంక్షేమ హాస్టల్స్ లో పాఠశాలలో, గురుకులాలలో పంపిణీ చేయాలని లేని యెడల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్స్ వార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కడైనా ఇబ్బంది ఉంటే ఆయా శాఖల సంక్షేమ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఈ రెండు రోజుల్లో తెప్పించుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సకాలంలో పిల్లలందరికీ యూనిఫాంలు, పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయాలని సంబంధిత అధికారులను శాఖల వారీగా సమీక్షిస్తూ సూచించారు. ఈ విషయంలో జిల్లా విద్యాధికారి ప్రత్యేక చొరవ చూపాలని ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. పాఠశాలలు, హాస్టల్స్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని, చిన్నచిన్న సమస్యలు ఉంటే పరిష్కరించాలని, ఆవరణలలో పరిశుభ్రత, పచ్చదనం ఉండాలని, తాగునీటి వసతి వంటి సదుపాయాలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

# శుక్రవారం సభ భేష్

## కరీంనగర్ కలెక్టర్ ను అభినందించిన మంత్రి సీతక్క



**కరీంనగర్, మహా:**

కరీంనగర్ జిల్లాలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శుక్రవారం సభ మంచి కార్యక్రమమని, మహిళా సమస్యల పరిష్కార వేదికగా ఉన్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని పంచాయతీరాజ్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క అన్నారు.మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తు కార్యాచరణపై హైదరాబాద్లోని రాజేంద్రనగర్ లో గల జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఈనెల 4, 5న "మేథో మథన సదస్సు" నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు సంబంధించిన మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు అభివృద్ధి ప్రగతి నివేదికను వివరించగా కరీంనగర్ జిల్లాలో అమలు చేస్తున్న "శుక్రవారం సభ" గురించి కరీంనగర్ జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.మహిళల ఆరోగ్యం, పోషకాహార స్థితిని మెరుగుపరిచేందుకు, వివిధ సామాజిక సమస్యల పరిష్కారానికి ఈ సభ ఏ విధంగా ఉపకరిస్తుందో తెలియజేశారు, "మేథో మథన సదస్సు"కు హాజరైన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క, ప్రభుత్వ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ శుక్రవారం సభ ప్రజెంటేషన్ ను తిలకించి అభినందించారు.శుక్రవారం సభను అన్ని జిల్లాల్లోనూ అమలు చేస్తే మంచి ఫలితాలొస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం సభ విధివిధానాలను, రాష్ట్రంలో అమలు చేసేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సిడిపిఓలు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయిని కలెక్టరేట్లో శుక్రవారం సత్కరించారు.



## తహసీల్దార్ కర్ర శ్రీపాల్ మరణం అత్యంత బాధాకరం

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని, జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య

**హన్మకొండ మహా;** గుండె పోటుతో శుక్రవారం ఉదయం పరమపదించిన హనుమకొండ మండల తహసీల్దార్ కర్ర శ్రీపాల్ రెడ్డి భౌతిక ఖాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య , అడిషనల్ కలెక్టర్, తహసీల్దార్ లు, అధికారులు.. విధి నిర్వహణలో నిత్యం ప్రజల పక్షాన నిబద్ధతతో పనిచేసిన శ్రీపాల్ మరణవార్త చాలా బాధాకరమని ఎమ్మెల్యే నాయిని విచారం వ్యక్తం చేశారు. శ్రీపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు కోరుకున్నారు.

### ఎంపీ వద్దిరాజు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ తో కలిసి

# పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**వరంగల్ మహా;** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ తో కలిసి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సూరిపల్లిలో శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ దేవి అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరయ్యారు. శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ దేవి, పెద్దిరాజు స్వామి వారి విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో ఈనెల 4వతేదీన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.ఈ మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం డోలు, డప్పు వాయిద్యాలు, నృత్యాలు,వేద మంత్రాలు, వేలాది మంది భక్తుల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాష్ లు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామస్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పెద్దమ్మ తల్లి కరుణాకటాక్షాలు సూరిపల్లి వాసులపై ఎల్లప్పుడూ ఉండాలని, వానలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ రవిచంద్ర, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాష్ లకు ఆలయ కమిటీ అధ్యక్షుడు దుండి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సింగారపు భాస్కర్ రాజు, కమిటీ సభ్యులు పిట్టల కొమ్మాలు,వేమ రమేష్, ప్రముఖుల ఆధ్వర్యంలో గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.



## మిల్స్ కాలనీ సీఐగా బొల్లం రమేష్ నియామకం

**వరంగల్ మహా;** వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా బొల్లం రమేష్ ను నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈ ఇన్స్పెక్టర్ రమేష్ నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో రెండు సంవత్సరాలు, ఇన్స్పెక్టర్ గా ఖమ్మం జిల్లా అశ్వాపురం, ధర్మసాగర్, హుజురాబాద్, కొత్తగూడెం సిసిఎస్ లో కూడా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కరీంనగర్ కమిషనరేట్ లో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ స్టేషన్ కు కొందరు పోటీ పడినప్పటికీ మరికొందరు వెనుకడుగు వేశారు. అయినప్పటికీ ఇలాంటి నియమ నిబద్ధత కలిగిన పోలీస్ ఆఫీసర్ ను మీల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ గా పోలీస్ కమిషనర్ నియమించడం పోలీస్ వర్గాల్లోనూ ఇటు వరంగల్ తూర్పులో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఈయన కరీంనగర్ జిల్లా నుంచి వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం లోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు ఇన్స్పెక్టర్ గా బదిలీ అయ్యారు.

## ప్రతి పోలీస్ నిజాయితీగా

# సేవాలందించాలి



**హన్మకొండ మహా;**

విధి నిర్వహణలో ఉన్న ప్రతి పోలీస్ నిజాయితీగా ప్రజలకు సేవాలందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రాయపర్తి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా శుక్రవారం భాధ్యతలు చేపట్టిన యం రాజేందర్ శుక్రవారం పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం అందించే విధంగా పోలీసులు విధులు నిర్వహించాలని సీపీ నూతన ఎస్.ఐ కి తెలిపారు.

# కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేసిన మేయర్,మాజీ ఎమ్మెల్సీ



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 22వ డివిజన్ లోని కాలనీ వాసుల కల కమ్యూనిటీ హాల్ కలగానే మిగిలిపోయింది. వారి అభ్యర్థన మేరకు కొన్ని సంవత్సరాలుగా ఫంక్షన్స్, ఇతర కార్యక్రమాలు చేయాలనుకునే పేద మధ్యతరగతి ప్రజల బాధలను గుర్తించి ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి కమ్యూనిటీ హాల్ కు 50 లక్షల నిధులు మంజూరు చేయగా శుక్రవారం గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు విచ్చేసి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మున్సిపల్ నుండి నా వంతు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ మాట్లాడుతూ అన్ని కులాలకు సంబంధించిన కమ్యూనిటి హల్ నిర్మాణం చేపట్టామని ఇది ఎంతో సంతోషకరమైన ఈ కార్యక్రమాన్ని చేస్తున్నామని మంత్రి కొండా సురేఖ సారథ్యంలో మేమందరం చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ జోషి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్, సయ్యద్ వసీం, తోట వేణు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోడీ 11 సంవత్సరాల పాలనలో అనేక సంక్షేమ పథకాలు

### దేశ ప్రజల మన్ననలను పొందిన ప్రధాని



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కేంద్ర ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర నాయకులు అన్నారు. శుక్రవారం వైష్ణవి గార్డెన్లో ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు గోదాల శేఖర్ రెడ్డి అధ్యక్షతన, మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కదారి జంగయ్య యాదవ్, బోసుపల్లి ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై, సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ... స్థానిక సమస్యలపై చర్చించడం జరిగింది. అమలు కాని ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేశారని, అమలు గాని పథకాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాలని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ గత 10 ఏళ్ల పాలనలో మోసం చేసిన తీరును ప్రజల్లోకి తీసుకపోవాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పడిన 11 సంవత్సరాలలో మోడీ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిన పథకాలను గ్రామాలలోని ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి కార్యకర్తలు అందరూ తయారుగా ఉండాలని కోరారు. అదేవిధంగా పోరెడ్డి అర్జున్ రెడ్డి మాట్లాడుతూ... ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ ప్రపంచ దేశాలలో శక్తివంతమైన దేశంగా గుర్తించబడింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో దొండ రమణారెడ్డి, దండే శ్రీశైలం, బాలశివుడు, శ్రీనివాస్ రెడ్డి, విట్టల్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా అధిక లాభాలు

### భూభారతి సదస్సును సందర్శించిన వరంగల్ కలెక్టర్

### ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్





**వరంగల్ మహా;** కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర కార్యక్రమాన్ని చెన్నారావు పేట మండలం అమీన్‌బాద్ గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని నర్సంపేట డివిజన్ రైతులు ఒక నెల వరి పంటను ఆలస్యంగా వేస్తున్నారని, ముందుగా వేయాలని సూచించారు. అలాగే, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు వాడాలని అలాగే రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ, చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలను కూడా చేయాలని, అదేవిధంగా చిన్న తరహా వ్యవసాయ యంత్రాల వాడకం ద్వారా పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖజాయింట్ డైరెక్టర్, డా. బాలకృష్ణ, మాట్లాడుతూ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ క్రింద ఎవరైనా లోన్ తీసుకొని పశువుల పెంపకం చేపట్టాలి అని తెలిపారు. దామోదర్ రెడ్డి, ఏడిఏ నర్సంపేట, శాస్త్రవేత్తలు డా రాజు, శతీష్ చంద్ర, స్థానిక మండల రెవిన్యూ అధికారి ఫణికుమార్, మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి తో పాటు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**భూభారతి రెవెన్యూ సదస్సులు పరిశీలించిన కలెక్టర్**

అనంతరం చెన్నారావుపేట మండలం అమినాబాద్ లో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ సందర్శించి రైతులు అందించిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఫణి కుమార్, నాయబ్ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ**

పర్వతగిరి మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం పర్వతగిరి మండల పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద 249 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

## మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష



### రూ 3900 జరిమాన

**జగిత్యాల, మహా:** జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్ స్టేషన్ పరిదిలోనికి చెందిన మైనర్ బాలికను సామల్ల అరవింద్ (28) అనే వ్యక్తి అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు కోర్టులో ఆధారాలు సమర్పించగా పిపి కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టగా, సాక్షులను విచారించిన న్యాయమూర్తి సుగాలి నారాయణ శుక్రవారం నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 3,900 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్బంగా ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి నిందితుడికి శిక్ష పడేలా చేస్తారని సూచించారు. పై కేస్ లో నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన పీపీ మల్లేశం, సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణకుమార్, సిఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ నరేష్, సిఎంఎస్ కానిస్టేబుల్ లు కిరణ్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



**వరంగల్ మహా;** తెలంగాణ గురుకుల మహిళ డిగ్రీ వరంగల్ తూర్పు కళాశాలలో అడ్మిషన్ల ప్రారంభం గురించి వరంగల్ తూర్పు కళాశాల ప్రిన్సిపల్ డా వి రాధిక తెలియజేస్తూ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ ( TGSWRDCW) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 28 టీఎస్ డబ్ల్యూ ఆర్ డి సి డబ్ల్యూ మహిళ డిగ్రీ కళాశాలలో 2025 26 విద్యా సంవత్సరానికి గాను బిఏ బీకాం బీఎస్సీ మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశాల కోసం అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిగ్రీలో అడ్మిషన్ కోసం మహిళా అభ్యర్థులు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డ్ లేదా ఇతర గుర్తింపు పొందిన బోర్డుల ద్వారా నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్ష 2025లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థుల వార్షిక ఆదాయం 1,50,000 కి మించ కూడదు, పట్టణ ప్రాంతాల అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం రెండు లక్షలకు మించరాదని తెలిపారు.

**అడ్మిషన్ పొందుటకు**

దరఖాస్తు పత్రాలను నాయుడు పెట్రోల్ పంప్ సమీపమందు గల వరంగల్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో నేరుగా సమర్పించాలని దరఖాస్తులు స్వీకరించేందుకు చివరి తేదీ 23/ 6/ 2025 గా సూచించారు.

**దరఖాస్తు తో పాటు జత చేయవలసిన పత్రాలు**

పదవ తరగతి మార్కుల మెమో, ఇంటర్ మార్కుల మెమో , 1/1 2025 తర్వాత పొందిన తాజా ఆదాయ ధ్రువీకరణ పత్రం కుల ధ్రువీకరణ పత్రం 5 పాస్ట్ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు.. పైన తెలిపిన గ్రూపులలో చేరుటకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు త్వరగా రావాలని వరంగల్ తూర్పు కళాశాల ప్రిన్సిపల్ డా. వి రాధిక తెలియజేశారు. పూర్తి వివరాలకు ఈ కింది నెంబర్ల లో సంప్రదించవచ్చునని 7995010683, 7702676584 తెలిపారు.



## శ్రీ చత్రపతి శివాజీ విగ్రహా ఆవిష్కరణ

**రాజేంద్రనగర్ మహా ;** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట గ్రామంలో మరాఠా యోధుడు, హిందూ హృదయ సామ్రాట్, హిందూ ధర్మ స్థాపనకై కృషి చేసిన వీరుడు శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బోర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బడిబాటను సక్సెస్ చేయాలి: కేఎల్ఆర్



**బాలాపూర్ మహా:** ఈరోజు నుండి 19 తేదీ వరకు ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి సర్కారీ స్కూళ్ల పై విశ్వాసం పెంచేందుకు కసరత్తు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రభుత్వ బడి విద్యార్థులకు ఇప్పటికే నైపుణ్య శిక్షణ ఇస్తున్న లీడ్ ఇండియా. ఇవాల్టి నుంచి ఈనెల 19వరకు సర్కార్ బడుల పై విశ్వాసం పెంచేలా తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ అడ్మిషన్ల ప్రక్రియను పెంచేలా బడిబాట పట్టాలని లీడ్ ఇండియా అండ్ కేఎల్ఆర్ ట్రస్ట్ అధినేత కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి అంగన్వాడీ, ప్రభుత్వ స్కూళ్లల్లో చేర్పించాలని టీచర్లకు కేఎల్ఆర్ సూచించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను స్థానిక ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలు, కాంగ్రెస్ శ్రేణులు పిల్లల తల్లిదండ్రులకు తెలపాలన్నారు. విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, క్వాలిఫైడ్ టీచర్ల గురించి వివరించాలని మాజీ లెక్చరర్ లక్ష్మారెడ్డి అన్నారు. KLR ట్రస్ట్ ద్వారా లీడ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో నైపుణ్య శిక్షణను అందిస్తూ దశాబ్దాలుగా లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ప్రైవేటు బడులకు ధీటుగా పోస్టర్లు అంటించటం, వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలని అందుకు అయ్యే ఖర్చును KLR ట్రస్ట్ అందిస్తుందన్నారు. త్వరలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ద్వారా డిజిటల్ తరగతి గదులు, అభ్యసనం చేయించే కార్యక్రమం ఉందన్నారు కిచ్చెన్నగారు. విద్యార్థుల్లో సామర్థ్యం పెంచేలా క్రీడలు, క్విజ్ పోటీలు, మొక్కలు నాటడం నేర్పించాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు.



## ఈద్-ఉల్ -అజ్ హా(బక్రీద్) శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని ముస్లింలందరికీ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈద్ ఉల్ అజ్ హా( బక్రీద్) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఓ ప్రకటన జారీ చేస్తూ త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో పండగ జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.



## ఇద్దరు దుండగులు ఫిజియోథేరపి చేస్తామని వచ్చి వృద్ధ దంపతుల హత్య

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేలు జనచైతన్య పేస్ 2 అపార్ట్మెంట్ ఐదో అంతస్తులో వృద్ధ దంపతులు అబ్దుల్లా (70 ) బ్యాంకులో ఉద్యోగం చేసి రిటైర్అయిందు, రిజ్వానా (65 ) లెక్చరర్ గా రిటైర్ అయ్యారు. 40 రోజుల క్రితమే అపార్ట్మెంట్ నిర్మించుకొని మిగతా పోర్షన్లను రెంటికిచి ఐదో ఫ్లోర్ లో నివాసం ఉంటున్నారు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం ఫిజియోథెరపీ మసాజ్ చేయడానికి వచ్చామని తమ యజమానికి సమాచారం తెలుపాలని అపార్ట్మెంట్ వాచ్మెన్ తో చెప్పడంతో, వాచ్మెన్ ఐదవ ఫ్లోర్ లో ఉన్న దంపతులకు ఫోన్ చేసి కనుక్కో గా రమ్మనడంతో ఇద్దరు వ్యక్తులో ఒక వ్యక్తి బుర్కా ధరించి మరొక వ్యక్తి మాస్కు ధరించి ఐదో ఫ్లోర్ లోకి వెళ్లారు. 40 నిమిషాల తర్వాత బయటికి వచ్చారు. కత్తులతో దాడి చేసి హత్య చేసి అపార్ట్మెంట్లో ఉన్న దస్తావేజులను తనిఖీలు చేసి వెళ్లిపోయారు. శుక్రవారం జనచైతన్య పేస్ 2 అపార్ట్మెంట్లో వృద్ధ దంపతులు రక్తపు మడుగులో పడి ఉన్నారని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం రావడంతో, పోలీసులు బుద్వేల్ జన చైతన్య ఫేస్ 2 లోని అబ్రిజ్ రెసిడెన్సీ అపార్ట్ మెంట్ 5వ అంతస్తులో ఉన్న వృద్ధ దంపతులు రక్తపు మడుగులో పడి ఉన్నారు. రాజేంద్రనగర్ పోలీసులు డాగ్స్ క్యార్డ్ క్లూస్ టీం లతో విచారణ వేగవంతం చేశారు. సంఘటన స్థలంలో సీసీటీవీ ఫుటేజుల కోసం అన్వేషిస్తున్నామని డిసిపి శ్రీనివాస్ తెలిపారు.



## భక్తికి ధైర్యానికి మరో రూపం ఆంజనేయుడు


### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్, మహా:** ఆంజనేయుడు అంటే హనుమంతుడు, ఆయన అతి బలాన్ని, ధైర్యాన్ని, భక్తికి మరో రూపమని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదర్ గూడెం మండలం రావిర్యాల గ్రామ పంచాయతీ వీర సముద్రం గ్రామంలో పబ్బతి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ శ్రీరాముడికి అత్యంత నమ్మకమైన సేవకుడుగా, ఆంజనేయుడు సీతాన్వేషణలో శ్రీరాముడికి సహాయపడటం మరియు లంకపై దాడికి వెళ్ళడం ద్వారా తన బలాన్ని నిరూపించాడనీ గ్రామాల్లో ఆంజనేయస్వామి దేవాలయాల ఏర్పాటుతో ప్రజలు ఆధ్యాత్మికంగా మరింత బలవంతులవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజు, శివ కుమార్, ఆంజనేయులు, కె కె కృష్ణ, మల్లేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు..

## పోరాడితేనే చట్టాలు సాధించుకుంటాం

### చట్టాలకు వ్యతిరేకంగా పిడికిలి బిగిద్దాం

### ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రయ్య



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యాతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి చంద్రయ్య సమావేశంలో పాల్గొన్నారు. సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందు సాధించుకున్న చట్టాలను నేటి నరేంద్ర మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా ఆ చట్టాలను నిర్వీర్యం చేసే కుట్రకు తెర లేపిందన్నారు. కార్మిక కోడ్ లను తెచ్చి చట్టాలన్నిటిని వాటి పరిధిలోకి మార్చడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. స్వాతంత్రం రాకముందు సాధించుకున్న చట్టాలను సైతం ఈ ప్రభుత్వం మార్చే కుట్ర చేస్తుంది. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు తక్కువ వేతనాలతో పనిచేయించుకుంటూ యాజమాన్యాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారు, వాటిపైన అధికారులు దృష్టి కేంద్రీకరించి యాజమాన్యాల మీద క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు హమాలీ కార్మికులు ఆటో రిక్షా, లారీ డ్రైవర్లు లాంటి ఎందరో కార్మికుల బ్రతుకులకు జీవిత రక్షణ లేక కార్మికుల బ్రతుకులు ఆగమైపోతున్నాయి. ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చీమ కట్టినట్టు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఏఐటియుసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మల్లేష్, సకురు నాయక్ స్వామి, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి, మహదేవ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండగ సందర్భంగా భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ




**జగిత్యాల,మహా:** నేడు జరగబోయే బక్రీద్ పండగ నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ తరపున భద్రతాపరమైన ఏర్పాట్లు చేయడం జరిగిం దని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన కూడళ్లలో ,మసీదులు, మార్కెట్ ప్రాంతా లు,టవర్ సర్కిల్ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్స్ ను జిల్లా ఎస్పీ ప్రత్యక్షంగా పరిశీలించి భద్రతాపరంగా చేయవలసిన ఏర్పాట్లు గురించి అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బక్రీద్ పండగను అందరూ కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని దీని కోసం పోలీస్ శాఖ అవసరమైన భద్రతాయపరమైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి చెక్ పోస్ట్ నందు పోలీసు సిబ్బంది తో 24 గంటలు వాహనాల తనిఖీలు చేపట్టి పశువుల అక్రమ రవా ణా జరగకుండా విధులను నిర్వర్తిస్తున్నట్లు తెలియజేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాల న్నారు.సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను పోస్ట్ చేసిన ,ఫార్వార్డ్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్ల పై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఎస్ఐ కిరణ్ కుమార్, మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## యోగాతో చరిత్ర సృష్టించవచ్చు..!

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. యోగ క్యాలెండర్ విడుదల చేసిన ఎమ్మెల్యే



**షాద్ నగర్, మహా:** 24 గంటల్లో కొంత సమయం యోగ కోసం కేటాయిస్తే ఆరోగ్య విషయంలో చరిత్ర సృష్టించవచ్చని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. షాద్ నగర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయుష్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో 11 ఇంటర్నేషనల్ యోగ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరికి అవసరమనీ వారి యొక్క ఆరోగ్యాలను కాపాడుకోవాలి అంటే ప్రతి ఒక్కరు కూడా తప్పకుండా ప్రతిరోజు ఆరోగ్యం కోసము ఒక్క గంట సేపు ఎక్సర్సైజులు మరియు యోగా తప్పకుండా చేసుకోవాలని సూచించారు. మరియు ఈనెల జూన్ 21న జాతీయ యోగ డే 10 సంవత్సరములు దాటి, 11వ సంవత్సరం యొక్క యోగా డే దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరూ కూడా జూన్ 21 యోగా డే రోజు పాల్గొని యోగా చేయాలని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చెంది తిరుపతి రెడ్డి, ఖదీర్, నర్సింలు, డాక్టర్ జి. షీలా మేడం , డాక్టర్ జయ ప్రకాష్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ లు బాబు చిన్మయ రంగా, వరలక్ష్మి, ఈశ్వరి, యోగ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..

## ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

### ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి

**షాద్ నగర్, మహా:** ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం నందిగామ మండలంలోని శ్రీనివాసులగూడ గ్రామంలో ఆంజనేయ స్వామి ధజస్తంభ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మురళీ యాదవ్ మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఈట గణేష్ వంకాయల నారాయణ రెడ్డి,కట్న రవీందర్,విట్టల్, గొర్లపల్లి అశోక్, గోవింద్ అశోక్,పాట్వారి శ్రవణ్,దామోదర్



రెడ్డి,నర్సిములు, చంద్ర రెడ్డి, కట్న శ్రీశైలం,కుమార్ గౌడ్, హన్మంత్ రెడ్డి, రాంరెడ్డి,మొయినోదిన్, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కుమ్మరి క్రిష్ణ,ఈదులపల్లి గణేష్ గౌడ్,రాజేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, యాదగిరి రెడ్డి, యాదగిరి రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,శివ చారి,అబ్బాస్, కోరె రాజు, బండ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ANN తెలుగు
మహా పత్రిక 07
శనివారం, హైదరాబాద్ | 07-06-2025 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM




# స్టార్‌లింక్‌కు లైసెన్స్ వచ్చేసింది

## భారత్‌లో ఇక కొత్త ఇంటర్నెట్ సేవలు

భారత్‌లో శాటిలైట్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. మార్కెట్ ను చేజిక్కించుకోవాలన్న శాటిలైట్ కంపెనీ కలలకు ఊతమిచ్చేలా స్టార్ లింక్‌కు డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ నుంచి కీలక లైసెన్స్ లభించింది. భారత టెలికాం మంత్రిత్వ శాఖ నుండి లైసెన్స పొందిన స్టార్ లింక్ దేశంలోని 90 కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులను అందిపుచ్చుకునే లక్ష్యంతో భారతదేశంలో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని వార్తా సంస్థలు రాయిటర్స్, బ్లూమ్‌బర్గ్ నివేదించాయి. కాగా స్టార్ లింక్ కు నిజంగానే లైసెన్స్ లభించిందని, దరఖాస్తు చేసుకున్న 15-20 రోజుల్లో ట్రయల్ స్పెక్ట్రమ్ మంజూరు చేస్తామని డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ వర్గాలు ధ్రువీకరించినట్లుగా పీటీఐ వార్తసంస్థ కూడా పేర్కొంది. దేశంలో సేవలను అందించడానికి యూటెల్ శాట్‌కు చెందిన వన్‌వెబ్, రిలయన్స్ జియో ఇలాంటి దరఖాస్తులను ఆమోదించిన భారత టెలికమ్యూనికేషన్ల విభాగం నుండి లైసెన్స్ పొందిన మూడవ సంస్థ స్టార్‌లింక్. భారతదేశంలో వాణిజ్య కార్యకలాపాలు సాగించడానికి లైసెన్సుల కోసం స్టార్ లింక్ 2022 నుండి ఎదురుచూస్తోంది. కాని జాతీయ భద్రతా ఆందోళనలతో సహా కారణాల వల్ల జాప్యం జరిగింది. అమెజాన్ కు చెందిన కుయిపర్ ఇండియా లైసెన్స్ కోసం ఇప్పటికీ ఎదురుచూస్తోంది. ప్రపంచవ్యాప్తంగా.. స్టార్‌లింక్ సేవలు చాలా ఖరీదైనవిగా ఉన్నాయి. యునైటెడ్ స్టేట్స్‌లో, రెసిడెన్షియల్ లైట్ ప్లాన్ నెలకు దాదాపు 80 డాలర్లు (రూ. 6,800). అయితే కస్టమర్‌లు 349 డాలర్లతో (రూ. 29,700) వన్ టైమ్ రుసుముతో స్టార్‌లింక్ స్టాండర్డ్ కిట్‌ను కూడా కొనుగోలు చేయాలి. అయితే భారతదేశంలో స్టార్‌లింక్ సర్వీస్ ప్రారంభమైన తరువాత.. దీని ఛార్జీలు నెలకు 10 డాలర్ల (రూ.850) వరకు ఉండే అవకాశం ఉంది. పరిచయ ఆఫర్లలో భాగంగా సంస్థ అపరిమిత డేటాను అందించే అవకాశం ఉంది.



# ఫ్లిప్‌కార్ట్ ఇక నేరుగా అప్పులిస్తుంది

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌కి రిజర్వ్ బ్యాంక్ నుంచి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్సు లభించింది. ఈ ఏడాది మార్చిలో ఆర్‌బీఐ దీన్ని మంజూరు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫ్లిప్‌కార్ట్ దీన్ని ధ్రువీకరించినప్పటికీ, ఇతర వివరాలను వెల్లడించలేదు. ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు లభించడంతో ఇకపై కస్టమర్లకు ఫ్లిప్‌కార్ట్ నేరుగా రుణాలు అందించేందుకు వీలు లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌లో అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్‌కి ప్రస్తుతం 80 శాతం వాటాలు ఉన్నాయి. త్వరలో ఐపీవోకి వచ్చే యోచనలో ఉన్న ఫ్లిప్‌కార్ట్ తమ హోల్డింగ్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని సింగపూర్ నుంచి భారత్‌కు మార్చే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది. ఈ ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు ఫ్లిప్‌కార్ట్‌కు ఆర్థిక సేవల రంగంలో కొత్త అవకాశాలను తెరుస్తుంది. ముఖ్యంగా డిజిటల్ రుణాలు, క్రెడిట్ ఉత్పత్తులు, కస్టమర్ ఆర్థిక అవసరాలను తీర్చేందుకు సౌలభ్యం కల్పిస్తుంది. భారత్‌లో ఈకామర్స్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో, ఈ లైసెన్సు ఫ్లిప్‌కార్ట్‌కు పోటీలో ముందంజలో ఉండటానికి, వినియోగదారులకు సమగ్ర సేవలను అందించడానికి సహాయపడుతుంది.

# వెండిపై రిచ్‌డాడ్ పూర్ డాడ్ రాబర్ట్ కియోసాకి సంచలనం



బంగారం మాదిరిగానే వెండి ధరలు కూడా తారా స్థాయికి పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. 13 ఏళ్ల తర్వాత వెండి ధర ఔన్స్‌కు కొత్త గరిష్టం 35 డాలర్లు దాటింది. 2012 ఫిబ్రవరి తర్వాత వెండి ధర ఇదే అత్యధికం. శుక్రవారం (జూన్ 6) 36 డాలర్లకు పైగా ట్రేడ్ అయిన వెండి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో రిచ్‌డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి వెండి ధరలపై సంచలన అంచనాను వెల్లడించారు. వెండి ధర అకస్మాత్తుగా పెరగడానికి కారణమేమిటో ప్రస్తుతానికి తెలియలేదు. కానీ చాలా మంది మార్కెట్ విశ్లేషకులు, పరిశ్రమ నిపుణులు ఇది పూర్తిగా 'నిష్పత్తి ట్రేడింగ్' అని పిలుస్తున్నారు. అంటే బంగారంవెండి నిష్పత్తి 100కు దిగువకు రావడమే వెండి ధరల పెరుగుదలకు కారణంగా భావిస్తున్నారు.

**బంగారం-వెండి నిష్పత్తి అంటే..**

ఒక ఔన్స్ బంగారంతో ఎన్ని ఔన్సుల వెండి కొనొచ్చే తెలిపే ఆర్థిక ప్రమాణాన్ని బంగారంవెండి నిష్పత్తిగా పేర్కొంటారు. దీని దీర్ఘకాల సగటు 70 కాగా జనవరి నుంచి 100 వద్ద ఉంటూ వస్తోంది. నేడు (జూన్ 6న) బంగారంవెండి నిష్పత్తి 93.33 వద్ద చలించింది. ప్రస్తుతం బంగారం ధర ఔన్స్‌కు 3,360 డాలర్లు, వెండి ధర 36 డాలర్లుగా ఉంది. బంగారంవెండి నిష్పత్తిలో ఈ భారీ పతనమే ఇప్పుడు వెండి ధరలను ప్రేరేపించిందని తెలుస్తోంది.

**రాబర్ట్ కియోసాకి ఏమన్నారంటే..**

తన పుస్తకం రిచ్ డాడ్ పూర్ డాడ్ ద్వారా ప్రసిద్ధి చెందిన రచయిత, ఆర్థిక విద్యావేత్త రాబర్ట్ కియోసాకి వెండి, బంగారంపై పెట్టుబడులను ప్రోత్సహిస్తూ ఉంటారు. ఈ మధ్య బిట్ కాయిన్‌లపై ఇన్వెస్ట్ చేయడాన్ని ఆయన సమర్థిస్తున్నారు. అయితే ప్రస్తుతం వెండి ధర ఔన్స్‌కు 35 డాలర్లను తాకిన తరుణంలో రాబర్ట్ కియోసాకి ఓ సంచలన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "వెండి ఈ రోజు ఉత్తమ బేరం అని నేను నమ్ముతున్నాను. సిల్వర్ ఈ ఏడాది డబుల్ అంటే 70 డాలర్లు కావొచ్చని భావిస్తున్నాను'' అని 'ఎక్స్' (ట్విటర్) పోస్ట్‌లో పేర్కొన్నారు.

**ఒక్క రోజే రూ.4వేలు పెరిగిన వెండి**

దేశంలో వెండి ధరలు అమాంతం ఎగిశాయి. శుక్రవారం (జూన్ 6) ఒక్కరోజే వెండి ధర కేజీకి రూ. 4వేలు పెరిగింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో కేజీ వెండి ధర రూ.3000 పెరిగి రూ.1,07,000లకు చేరింది. మరోవైపు హైదరాబాద్ ప్రాంతంలో కేజీ వెండి రూ.4వేలు ఎగిసి రూ.1,17,000లను తాకింది.

# పేమెంట్ చేయడం వచ్చు.. కానీ జాగ్రత్త!!




యూపీఐ చెల్లింపులు భారతదేశ ఆర్థిక ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేశాయి. డిజిటల్ పేమెంట్స్ లో యూపీఐ చెల్లింపులదే ఆధిపత్యం. ముఖ్యంగా టీనేజర్లు, కుర్రకారు ఎక్కువగా యూపీఐ చెల్లింపులు చేస్తున్నారు. దాదాపు అందరికీ యూపీఐ పేమెంట్స్ ఎలా చేయాలో తెలుసు. కానీ మోసాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నదానిపై చాలా మంది దృష్టి పెట్టడం లేదు. ఆన్‌లైన్ లావాదేవీలను లక్ష్యంగా చేసుకునే మోసాలు పెరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తాజా నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) ప్రకారం, 1529 సంవత్సరాల వయసువారిలో దాదాపు 99.5 శాతం మందికి యూపీఐ లావాదేవీలు నిర్వహించే సామర్థ్యం ఉంది. ఇది డిజిటల్ చెల్లింపులను విస్తృతంగా స్వీకరించడాన్ని హైలైట్ చేస్తున్నప్పటికీ, స్కామర్లు సైతం తమ వ్యూహాలను అమాయక యూజర్‌లను మోసం చేస్తున్నారని సైబర్ సెక్యూరిటీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**యూపీఐ లావాదేవీల్లో ఈ జాగ్రత్తలు పాటిస్తున్నారా?**

మోసాన్ని నివారించడానికి వినియోగదారులు ఈ భద్రతా ప్రోటోకాల్స్ పాటించాలని అధికారులు, ఆర్థిక నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. యూపీఐ పిన్ షేర్ చేయకండి: సైబర్ నేరగాళ్లు తరచూ బ్యాంకు అధికారులు లేదా కస్టమర్ కేర్ ప్రతినిధులమంటూ వినియోగదారులను మోసం చేస్తుంటారు. లావాదేవీ లింక్‌లను సరిచూసుకోండి: స్కామర్లు చట్టబద్ధమైన ప్లాట్ ఫారమ్ లను అనుకరించే నకిలీ యూపీఐ చెల్లింపు లింక్ లను పంపవచ్చు. లావాదేవీలను ఆమోదించడానికి ముందు ఎల్లప్పుడూ క్రాస్ చెక్ చేయండి. పేమెంట్ రిక్వెస్ట్‌ల పట్ల జాగ్రత్త: తెలియని వ్యక్తుల నుంచి పేమెంట్ రిక్వెస్ట్‌లు వచ్చినప్పుడు వాటికి స్పందించే ముందు సోర్స్‌ను చెక్ చేసుకోండి. అధికారిక యాప్‌లు, ప్లాట్ ఫామ్ ఉపయోగించొద్దు: భద్రతా ప్రమాదాలను తగ్గించడానికి ధ్రువీకరించిన బ్యాంకింగ్ లేదా పేమెంట్ యాప్‌ల ద్వారా యూపీఐ లావాదేవీలు జరిగేలా చూసుకోండి. అకౌంట్‌లో ఏం జరుగుతోందో చూసుకోండి: యూపీఐ లావాదేవీలను ట్రాక్ చేయడం అనధికార చెల్లింపులను ముందుగానే గుర్తించడంలో సహాయపడుతుంది.

## క్రీడా వార్తలు SPORTS NEWS

# జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ కొత్త చరిత్ర

## తొలిసారి ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీకి అర్హత.. చైనా జట్టుకు నిరాశ





**దోహా:** వచ్చే ఏడాది జరగనున్న ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు చైనా దూరమైంది. ఆసియా జోన్ అర్హత పోటీల్లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో చైనా 0-1 గోల్స్ తేడాతో ఇండోనేసియా చేతిలో పరాజయం పాలవడంతో... వరల్డ్‌కప్ రేసుకు దూరమైంది. ఇక ఉజ్బెకిస్తాన్, జోర్డాన్ తొలిసారి ప్రపంచకప్‌నకు అర్హత సాధించగా... క్వాలిఫయింగ్ పోటీల్లో చక్కటి ప్రదర్శన కనబర్చిన దక్షిణ కొరియా కూడా ముందంజ వేసింది. 2026లో అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ప్రపంచ కప్‌నకు ఇప్పటికి 10 జట్లు అర్హత సాధించాయి. ఆతిథ్య హోదాలో ఈ మూడు దేశాలు నేరుగా ముందంజ వేయగా... ఆసియా నుంచి జపాన్, ఇరాన్, జోర్డాన్, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్తాన్... ఓసియానియా నుంచి న్యూజిలాండ్... దక్షిణ అమెరికా నుంచి అర్జెంటీనా వరల్డ్‌కప్ బెర్తులు దక్కించుకున్నాయి.

**ఆసియా క్వాలిఫయింగ్ పోటీల్లో భాగంగా...**

గురువారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా 1-0తో జపాన్‌పై, ఇండోనేసియా 1-0తో చైనాపై, జోర్డాన్ 3-0తో ఒమన్‌పై, సౌదీ అరేబియా 2-0తో బహ్రెయిన్‌పై, పాలస్తీనా 2-0తో కువైట్‌పై, ఖతార్ 1-0తో ఇరాన్‌పై విజయాలు సాధించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఉజ్బెకిస్తాన్ మధ్య మ్యాచ్ 0-0తో 'డ్రా' కాగా... ఉత్తర కొరియా, కిర్గిస్తాన్ పోరు 2-2 గోల్స్‌తో సమమైంది. దక్షిణ కొరియా 2-0తో ఇరాక్‌పై గెలవడం ద్వారా వరుసగా 11వసారి వరల్డ్ కప్ బెర్త్ దక్కించుకుంది. యూఏఈ మ్యాచ్ 'డ్రా' అయినా... గ్రూప్ 'ఎ'లో ఇరాన్ తర్వాత రెండో స్థానంలో నిలవడం ద్వారా ఉజ్బెకిస్తాన్ ముందంజ వేసింది. గ్రూప్ 'బి' నుంచి దక్షిణ కొరియా, జోర్డాన్ టోర్నీకి అర్హత సాధించాయి. గ్రూప్ 'సి' నుంచి పోటీ పడుతున్న చైనా... ఇప్పటి వరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 7 పరాజయాలతో 6 పాయింట్లు ఖాతాలో వేసుకొని చివరి స్థానంలో కొనసాగుతోంది. మరొక్క మ్యాచ్ మాత్రమే మిగిలి ఉండగా... జపాన్ (20 పాయింట్లు), ఆస్ట్రేలియా (16 పాయింట్లు), సౌదీ అరేబియా (13 పాయింట్లు), ఇండోనేసియా (12 పాయింట్లు), బహ్రెయిన్ (6 పాయింట్లు)... చైనా కంటే ముందున్నాయి. 2022లో జరిగిన ప్రపంచకప్‌లో ఆసియా నుంచి 4 జట్లు మాత్రమే పాల్గొనగా... ఈసారి 8 జట్లు బరిలోకి దిగడం ఖాయమైంది. ఆఫ్రికా నుంచి 9 జట్లు, యూరప్ నుంచి 16 జట్లు వరల్డ్‌కప్‌లో పాల్గొననున్నాయి. ఈసారి ప్రపంచకప్‌లో మొత్తం 48 జట్లు పోటీపడుతున్నాయి.

**2026 ప్రపంచకప్ టోర్నీకి ఇప్పటి వరకు అర్హత సాధించిన జట్లు**

**ఆతిథ్య దేశాలు:** అమెరికా, మెక్సికో, కెనడా.
**ఆసియా:** జపాన్, ఇరాన్, జోర్డాన్, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్తాన్.
**ఓసియానియా:** న్యూజిలాండ్.
**దక్షిణ అమెరికా:** అర్జెంటీనా.

# ఆఖరి అంచెకు భారత్ సై



**అమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్):** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ హాకీ ఆఖరి అంచె పోటీలకు భారత జట్లు సిద్ధమయ్యాయి. ఈ యూరో అంచె పోటీల్లో అంచనాలకు మించి రాణించాలని, గరిష్ట పాయింట్లతో నేరుగా ప్రపంచకప్ బెర్తు సాధించాలని పురుషుల, మహిళల జట్లు పట్టుదలతో ఉన్నాయి. ముందుగా భారత పురుషుల జట్టు నేడు ఆతిథ్య నెదర్లాండ్స్‌తో తలపడుతుంది. భువనేశ్వర్ అంచె పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన భారత్ వచ్చే ప్రపంచకప్‌కు వేదికైన నెదర్లాండ్స్‌లోనూ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. నేడు, 9వ తేదీన డచ్ టీమ్‌తో జరిగే రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడం ద్వారా యూరో అంచెకు శుభారంభం పలకాలని హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత్ భావిస్తోంది. ప్రస్తుతం 15 పాయింట్లతో ఇంగ్లండ్ (16), బెల్జియం (16)ల తర్వాత మూడో స్థానంలో ఉన్న హర్మన్ బృందం ఈ ఆఖరి అంచె పోటీలతో మెరుగైన స్థానంలో నిలవాలని ఆశిస్తోంది. డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్, మిడ్‌ఫీల్డ్‌లో హార్దిక్ సింగ్‌లతో పాటు రక్షణ శ్రేణిలో అమిత్ రోహిదాస్, హర్మన్, జుగ్‌రాజ్, జర్మన్‌ప్రీత్‌లు స్థాయికి తగిన ఆటతీరును కనబరిస్తే గెలుపు ఏమంత కష్టం కాదు. భారత చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ తమ జట్టు అన్ని రంగాల్లోనూ మెరుగైందని, యువ ఆటగాళ్లు సైతం అనుభవం సంపాదించారని తప్పకుండా ప్రత్యర్థులపై పైచేయి సాధిస్తారని అన్నాడు. నెదర్లాండ్స్‌తో పోరు ముగిశాక భారత్ 11, 12 తేదీల్లో అర్జెంటీనాతో, 14, 15 తేదీల్లో ఆస్ట్రేలియాతో, 21, 22 తేదీల్లో బెల్జియంతో తలపడుతుంది. మరోవైపు మహిళల జట్టు యూరో అంచె పోటీలను లండన్‌లో ఆడనుంది. ఈ నెల 14 నుంచి భారత మహిళల జట్టు పోరు ప్రారంభం అవుతుంది. భారత జట్టు తొమ్మిది పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. ఇప్పటి వరకు ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు రెండింటిలో మాత్రమే గెలిచింది.

# అయ్యయ్యో నవదీప్..!



**న్యూఢిల్లీ:** నవదీప్ సింగ్ గుర్తున్నాడా... అదేనండీ మరుగుజ్జు జావెలిన్ త్రోయర్, పారిస్ పారాలింపిక్స్ (2024)లో ఎఫ్41 ఈవెంట్‌లో పోటీపడటంతోనే అందరిని ఆకర్షించాడు. పొట్టి కాళ్లతో చిట్టిచిట్టి అంగలు వేగంగా వేసుకుంటూ వెళ్లి ఈటెను విసిరిన ప్రదర్శన చాలా గమ్మత్తుగా ఉంటుంది. ఆ ప్రదర్శనతోనే నవదీప్ బంగారు పతకంతో అందలమెక్కాడు. మన ప్రధాని నరేంద్ర మోదీ ముచ్చటపడి మరీ అతనికి షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు నవదీప్‌తో సమానంగా ఫొటోలో కనిపించేందుకు కింద కూర్చున్నారు. అతని నెత్తికి టోపీపెట్టి అభినందించారు. అలా క్రీడా ప్రియులకు పరిచయమైన నవదీప్‌కు లాస్ ఏంజెలిస్-2028 ఒలింపిక్స్ పెద్ద షాక్ ఇచ్చింది. అతను స్వర్ణం నిలబెట్టుకునే అవకాశం లేకుండా 'ఎఫ్ 41' కేటగిరీని తదుపరి విశ్వక్రీడల నుంచి తొలగించింది. రోస్టర్‌లో భాగంగా ఆతిథ్య దేశం కొన్ని క్రీడలు లేదంటే కేటగిరీలను పక్కనబెట్టే అవకాశం ఒలింపిక్ చార్టర్ కల్పిస్తుంది. ఇందులో భాగంగానే నవదీప్ ఈవెంట్‌తో పాటు డిస్కస్ త్రోయర్ యోగేశ్ కథునియా 'ఎఫ్ 56' కేటగిరీని సైతం లాస్ ఏంజెలిస్ నిర్వాహకులు తొలగించారు. పారిస్‌లో యోగేశ్ డిస్కస్ త్రో 'ఎఫ్ 56' కేటగిరీలో రజత పతకం గెలుపొందాడు. అయితే వీరిద్దరి కేటగిరీలు లాస్ ఏంజెలిస్ పారాలింపిక్స్‌లోని 552 మెడల్ ఈవెంట్‌లలో లేవు. ఓవరాల్‌గా 4400 అథ్లెట్ల కోటాలో ఏ మార్పు లేదు. టోక్యో, పారిస్ పారాలింపిక్స్‌లో కూడా 4400 మంది అథ్లెట్లు పోటీపడ్డారు. మిగతా క్రీడా ఈవెంట్లను సర్దుబాటు చేయడం ద్వారా 4400 అథ్లెట్ల కోటా అలాగే కొనసాగుతోంది.

# రూ. 500కే లవ్లీనా అకాడమీలో బాక్సింగ్ శిక్షణ



**గువాహటి:** భారత స్టార్ మహిళా బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ తన ఒలింపిక్స్ కలను సాకారం చేసుకున్నట్లే మిగతా వారు కూడా ఒలింపియన్లుగా ఎదగాలనే లక్ష్యంతో అకాడమీని అందుబాటులోకి తెచ్చింది. ఉత్తర గువాహటిలోని బర్చంద్రాలో గురువారం లాంఛనంగా ప్రారంభమైన ఈ అకాడమీలో ఫీజు ఎంతో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. అందరూ వెచ్చించే విధంగా నెలకు కేవలం రూ. 500 చెల్లించి ఇక్కడ 'పంచ్'లు నేర్చుకోవచ్చు. 8 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయో విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఉంటుంది. అలాగే 18 ఏళ్ల పైబడిన వారికి కూడా కోచింగ్ ఇస్తారు. ఆమె లాభాపేక్షలేని కృషిని గుర్తించిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రూ. 2 కోట్ల గ్రాంట్‌ను అందజేయనున్నట్లు ప్రకటించారు. లవ్లీనా తన అకాడమీకి ప్రభుత్వ స్థలాన్ని అడగలేదు. 2021లో సొంతంగా అకాడమీ ఏర్పాటు కోసం స్థలం కొనుగోలు చేసిన ఆమె మెరుగైన మౌలిక సదుపాయాలతో దాన్ని తీర్చిదిద్దింది. 26-26 సైజ్ బాక్సింగ్ రింగ్‌తో పాటు ఆధునిక పరికరాలతో కూడిన జిమ్‌ను ఏర్పాటు చేసింది. గువాహటిలో సకల హంగులతో నెలకొల్పిన తొలి బాక్సింగ్ అకాడమీగా చెప్పవచ్చు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాల బాలబాలికలు, యువత కోసం దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రతిభాసక్తులు ఉన్న వారు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు, ప్రొఫెషనల్ బాక్సర్లుగా తయారయ్యేందుకు ఈ అకాడమీ దోహదం చేస్తుందని ఈ సందర్భంగా లవ్లీనా పేర్కొంది. కొత్త తరం బాక్సర్లకు ఇదో వేదికగా మారాలని ఆకాంక్షించింది. 'మేటి బాక్సర్లను తయారు చేయాలనే కలతో దీన్ని నిర్మించాను. ఇక్కడ శిక్షణ పొందిన బాక్సర్లు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాలు తేవాలని, 2028కల్లా కొందరైనా బాక్సర్లు వెలుగులోకి రావాలని ఆశిస్తున్నాను' అని 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన లవ్లీనా చెప్పింది. దశలవారీగా బాక్సర్లకు హాస్టల్ వసతి కల్పించాలనుకుంటున్నట్లు తెలిపింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని తీసుకుంటామని చెప్పింది.

# విందులో విజయ్ ఎమోషనల్.. ఇక గుడ్‌బై



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పేరు వింటే చాలు తమిళనాడు ఊగిపోతుంది. ఇక రాబోయే రోజుల్లో ఈ పేరు సినిమా రంగంలో ట్రెండింగ్‌లో ఉండకపోవచ్చు. ఎందుకంటే విజయ్ కథానాయకుడుగా నటిస్తున్న చివరి చిత్రం జననాయకన్ అని తెలిసిందే. గతేడాదిలో రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన విజయ్ రానున్న శాసనసభ ఎన్నికల్లో (2026) పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. దీంతో జననాయకన్ తన చివరి చిత్రమని ఆయనే స్వయంగా ప్రకటించారు. హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పూజాహెగ్డే నాయకిగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి గ్రిప్పింగ్స్ ఇప్పటికే విడుదలై చిత్ర అంచనాలను పెంచేశాయి. కాగా జననాయకన్ చిత్ర టీజర్‌ను విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 22న విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇందులో విజయ్ పోలీస్ అధికారిగా నటిస్తున్నట్లు టాక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అదేవిధంగా చిత్ర ఓటీటీ హక్కులను ఒక సంస్థ భారీ మొత్తానికి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ చిత్రం పొంగల్ సందర్భంగా జనవరి 2026లో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. కాగా జననాయకన్ చిత్ర షూటింగ్ ఇటీవల పూర్తయ్యింది. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులందరికీ బిరియానీ విందును ఇచ్చిన విజయ్ భావోద్రేకానికి గురైనట్లు సమాచారం. అప్పట్లో రాజకీయ రంగప్రవేశం చేసిన ఎంజీఆర్ నటించిన చివరి చిత్రం మదురై మీట్ట సుందరపాండియన్. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. జననాయకన్ చిత్రం విజయ్ జీవితాన్ని ఎలా మారుస్తుందో అనే ఆసక్తి ఇరాన్ అభిమానుల్లో నెలకొంది.

# హరిహర వీరమల్లు వాయిదా..



జూన్‌లో రిలీజవుతున్న పెద్ద సినిమాల్లో హరిహర వీరమల్లు ఒకటి. జూన్ 12న ఈ మూవీ విడుదల కావాల్సి ఉంది. కానీ అది అయ్యే పనిలా కనిపించడం లేదని చాలారోజులగా ప్రచారం జరుగుతోంది. చివరకు అదే నిజమైంది. ఇప్పటికే పలుమార్లు సినిమాను పోస్ట్‌పోన్ చేసిన చిత్రబృందం తాజాగా మరోసారి మూవీని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాత ఏ.ఎం రత్నం వెల్లడించాడు.

## వాయిదా తప్పట్లేదు

జూన్ 12న సినిమా మీ ముందుకు తీసుకురావడానికి ఎంతగానో ప్రయత్నించినప్పటికీ అది కుదర్లేదని పేర్కొన్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో వాయిదా వేయక తప్పడం లేదన్నాడు. హరిహర వీరమల్లును మరింత గొప్పగా మలచాలన్నదే తమ ప్రయత్నం అని, ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నామని వివవరణ ఇచ్చాడు. దీనికోసమే మరికాస్త సమయం అవసరమవుతుందని, అందరి ఎదురుచూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇచ్చాడు.

## ఎప్పటికీ గుర్తుండిపోయేలా..

ప్రతి దృశ్యం ఆశ్చర్యపరిచేలా, ప్రతి శబ్దం ప్రతిధ్వనించేలా, ప్రతి సన్నివేశం ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నాడు.. త్వరలో ట్రైలర్‌తోపాటు కొత్త విడుదల తేదీ ప్రకటిస్తాం అని తెలిపాడు. హరిహర వీరమల్లు సినిమాకు ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

# దీపికా పడుకోణెకు గోల్డెన్ ఛాన్స్

## మరికొన్ని గంటల్లో ప్రకటన



అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ సినిమా (AA22) నుంచి జూన్ 7న ఒక అప్డేట్ రానుందని తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ ఒక పోస్ట్ పంచుకుంది. ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి కూడా.. త్వరలో షూటింగ్‌కు సిద్ధం అవుతున్నారు. కొద్దిరోజుల క్రితం దర్శకుడు అట్లీ హైదరాబాద్ చేరుకుని, అల్లు అర్జున్‌తో సినిమా నిర్మాణ పనులకు సంబంధించిన చర్చలు చేశారు. సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని రూ. 700 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తోంది. అయితే, శనివారం ఉదయం 11గంటలకు ఒక అప్డేట్ ఇస్తామని పోస్టర్‌ను రిలీజ్ చేసింది. బహుశా హీరోయిన్ గురించి ప్రకటన చేస్తారని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతుంది.

అల్లు అర్జున్ అట్లీ (AA22) సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ 'దీపికా పడుకోణె'( Deepika Padukone) నటిస్తున్నట్లు టాక్ ఉంది. తనకు సంబంధించిన అప్డేట్ శనివారం అఫీషియల్‌గా ప్రకటిస్తారని సమాచారం. ఇదే ప్రాజెక్ట్‌లో జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ కూడా నటిస్తున్నారని తెలుస్తోంది. అయితే, వారిద్దరి గురించి అధికారిక ప్రకటన కోసం కొద్దిరోజులు వేచి ఉండాల్సిందే. దాదాపు జూన్ 7న మాత్రం దీపిక ప్రకటన ఉంటుందని బలంగా వార్తలు వస్తున్నాయి. (AA22) పేరుతో ప్రారంభమైన ఈ మూవీకి ఐకాన్, సూపర్‌హీరో అనే టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయని సమాచారం.

ఈ సినిమాలో అల్లు అర్జున్ భిన్న గెటప్పుల్లో కనువిందు చేయనున్నట్లు సమాచారం. కథకు తగ్గట్లుగానే అల్లు అర్జున్ పలు లుక్‌స్‌ను ప్రయత్నించినట్లు తెలుస్తోంది. పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ సినిమాగా ఇది రానున్నట్లు ప్రచారంలో ఉంది. అందుకోసం చిత్రబృందం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించే పనిలో ఉంది. హాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ ఇప్పటికే రంగంలోకి దిగింది.




# మొదలైన బ్యాచిలర్స్ ప్రేమకథలు



యస్.యం. 4 ఫిలిమ్స్ బ్యానర్‌పై గీత సింగ్, కార్తీక్ , కాశీ మదన్, ఇషాని, చలానా అగ్నిహోత్రి, శృతి లయ నటీనటులుగా యం.యన్. వి సాగర్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న చిత్రం "బ్యాచిలర్స్ ప్రేమ కథలు". ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ప్రముఖ దర్శకులు వి. సముద్ర కెమెరా స్విచ్ఛాన్ చేయగా, ప్రముఖ దర్శకులు వీర శంకర్ క్లాప్ ఇచ్చారు. ఆపై మీడియా సమావేశం నిర్వహించారు. చిత్ర దర్శక, నిర్మాత, సాగర్ మాట్లాడుతూ.. 'ఇంతకుముందు నేను తీసిన "కాలం రాసిన కథలు" సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.ఆ ఉత్సాహంతో దానికి సీక్వెల్‌గా 'బ్యాచిలర్స్ ప్రేమ కథలు' సినిమా తీస్తున్నాను. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు మంచి షోషల్ మెసేజ్ ఇవ్వబోతున్నాను. అలాగే ఇందులో కూడా నూతన నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాను.ఈ నెలలో షూటింగ్ ప్రారంభించి ఇదే ఏడాదిలోనే విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం.' అని అన్నారు.

# పార్ట్ 2కి వచ్చే సరికి కాస్టింగ్ మొత్తం మారింది ఏం జరుగుతుంది..!



సీక్వెల్స్ అంటే దాదాపుగా తొలి పార్ట్‌లో ఉన్న ఆర్టిస్ట్‌లనే కంటిన్యూ చేస్తారు. ప్రధాన పాత్రధారులని మార్చి సీక్వెల్స్ చేయడం చాలా అరుదు. కాని ఇప్పుడు కాక్‌టెయిల్ 2 కోసం కాస్టింగ్ అంతా మార్చేస్తున్నారనే టాక్ నడుస్తుంది. 'కాక్‌టెయిల్' చిత్రం 2012లో విడుదలైంది. ఈ చిత్రం హోమి అడాజానియా దర్శకత్వంలో రూపొందగా, ఈ చిత్రంలో సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె, డయానా పెంటీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం రొమాంటిక్ కామెడీ జానర్‌లో రూపొందింది. ఈ మూవీ కమర్షియల్‌గా విజయవంతం కావడమే కాకుండా విమర్శకుల నుండి మిక్స్‌డ్ టాక్ దక్కించుకుంది. బ్లాక్ బస్టర్ 'కాక్ టెయిల్' ఫ్రాంఛైజీలో కొత్త సినిమా వస్తోంది అంటే యూత్‌లో జోష్ వస్తుంది. పార్ట్ 1 విజయం సాధించిన తర్వాత హోమి అడాజానియా కాక్‌టెయిల్ 2 చిత్రంని రూపొందించడానికి రెడీ అయ్యాడు. అయితే రెండో పార్ట్‌లో తారాగణం అంతా మారబోతుందనే టాక్ నడుస్తుంది. 'కాక్‌టెయిల్ 2' చిత్రానికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడలేదు కాని, ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అనేక వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. షాహిద్ కపూర్ ఈ చిత్రంలో నటించడానికి అంగీకరించినట్లు సమాచారం. కృతి సనన్ మరియు రష్మిక మందన్నా కూడా ఈ చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఈ రొమాంటిక్ కామెడీ 2025 ఆగస్టులో సెట్స్ పైకి వెళ్తుందని వార్తలు వచ్చాయి. వచ్చే ఏడాది చివరి నాటికి థియేటర్స్‌లో తీసుకొచ్చే ప్రయత్నం చేయనున్నారట. భారతదేశం సహా యూరప్‌లోని కొన్ని సుందరమైన లొకేషన్లలో మూవీ చిత్రీకరణ జరపనున్నట్టు తెలుస్తుంది. షాహిద్ ప్రస్తుతం విశాల్ భరద్వాజ్ తదుపరి చిత్రంలో నటిస్తుండగా, ఈ మూవీకి అర్జున్ ఉస్తారా అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఇక కృతి విషయానికొస్తే ధనుష్ సరసన ఆనంద్ ఎల్ రాయ్ `తేరే ఇష్క్ మే` చిత్రంలో నటించింది. మరోవైపు రష్మిక, కాక్టెయిల్ 2 లో నటించే ముందు ఆయుష్మాన్ ఖురానాతో `థమా` షూటింగ్ పూర్తి చేయనుంది. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి పూర్తి క్లారిటీ కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com